ఇత్తడి బంగళా!

అజీజ్

"పోస్ట్!" అన్న కేక విని, చూస్తున్న పేపర్ మడిచి లేచింది షీల. ఆర్డినరీ ఉత్తరాలైతే లెటర్ బాక్స్‌లో వేసిపోతాడు పోస్ట్‌మెన్. ఏదో రిజిస్టర్డ్ పోస్టే అయ్యుంటుంది అనుకుంటూ గడియతీసి తలుపు తెరిచింది.

"రిజిస్టర్డ్ లెటర్ మేడమ్!" అంటూ ఓ గులాబీరంగు కవర్ అందించాడు పోస్ట్‌మెన్.

అక్నాలెడ్జ్‌మెంట్ కార్డుమీద సంతకం చేసి, కవర్ వెనక్కి తిప్పి, ఫ్రమ్ అడ్రస్ చూస్తూ లోపలికి వచ్చి కూర్చుంది.

'పి. జ చేలరావు,
బ్రాస్ ప్యాలెస్,
వంగత్తూర్.'

ఆ పేరుగానీ, ఆ 'ఇత్తడి బంగళా' గురించిగానీ అదివరకెప్పుడూ విన్న గుర్తులేదామెకు. మద్రాసుకు మూడు మైళ్ళ దూరంలో వుంది వంగత్తూర్. ఆ వూళ్ళోనూ తనకు

పరిచయమున్న వాళ్లెవ్వరూ లేరు. మరి యేమిటీ ఉత్తరం?...

అనుకుంటూ కవర్ చింపి, లోపల మడత పెట్టివున్న కాగితాన్ని యివతలికి లాగింది. కాగితం మడత విప్పగానే ఆశ్చర్యంతో షీల కళ్ళు పెద్దవయ్యాయి! కారణం, ఆ మడతలమధ్య ఓ వందరూపాయల పూర్తి నోటూ, సగం చింపిన వెయ్యి రూపాయలు నోటుముక్క పెట్టి ఉన్నాయి.

గబ గబ ఉత్తరాన్ని చదవడం ప్రారంభించింది.

'మిస్ షీలా!

ఈ వుత్తరం చూసి మీరు చాలా ఆశ్చర్య పోవచ్చు. కారణం, మనం, పరస్పరం అపరిచితులం! ఇంతవరకూ ఒకర్నొకరం చూసుకోలేదు. ఐనా, నేను మిమ్మల్ని నా అతిధిగా మా ఇంటికి ఆహ్వానిస్తున్నాను. నా ఆహ్వానాన్ని అంగీకరించి, వారం పదిరోజులపాటు నా యింట్లో ఆతిధ్యం స్వీకరించవలసిందిగా కోరుతున్నాను.

ఈ వింత ఆతిధ్యం యేమిటా అని ఆశ్చర్య పోవచ్చు, ముక్కూ మొహం తెలియని వ్యక్తి ఒక అపరిచితురాలిని యింటికి ఆహ్వానించడంలో యేదో గూడుపుఠాణీ ఉందని శంకించవచ్చు.

ఇందులో గూడుపుఠాణీ ఏమీ లేదు. పైగా నా ఆహ్వానాన్ని మన్నించడంలో మీకే అన్ని విధాలా లాభం చేకూరుతుంది. వయసులో ఉన్న, అందమైన మీరు ఒంటరిగా ఇక్కడికెలా రావాలా అని సందేహిస్తున్నారా? ఆ భయాలేవీ పెట్టుకోకండి. కారణం, నేను ఎనభైఏళ్ళ వయోవృద్ధుణ్ని!

ఇప్పుడో, అప్పుడో పరలోకానికి ప్రయాణం కట్టే ప్రయత్నంలో ఉన్న రోగిష్టిని!!

ఏదో ఒక సందర్భంలో మీరు నా పేరు వినే ఉంటారు. ఒకప్పుడు నేను దేశంలోకల్లా పేరు పొందిన ఇత్తడి వ్యాపారిని. ఆ రోజుల్లో మాకు మద్రాసు నగరంలో రకరకాల ఇత్తడి సామాను తయారుచేసే పెద్దఫ్యాక్టరీ వుండేది. నా అనారోగ్య కారణాలవల్ల క్రమేణా ఫ్యాక్టరీ ఉత్పత్తులు కుంటుపడి, పదేళ్ళ క్రితం దివాలా తీసినట్టు ప్రకటించి, వంగత్తూర్ లో ఉన్న మా పూర్వీకుల యింటికి మకాం మార్చేశాను.

బహుశా, ఇప్పుడు మీ కర్తమై ఉంటుంది. మా ఇంటికి 'బ్రాస్ ప్యాలెస్' అని పేరెందుకు పెట్టారో? ఈ ఉత్తరంతోబాటు మీ రాకపోకల ఖర్చు నిమిత్తం వంద రూపాయల నోటు పంపుతున్నాను...

అలాగే, వచ్చేది మీరే కాదో గుర్తింపుకోసం వెయ్యిరూపాయల నోటు ముక్క కూడా జతచేసి పంపుతున్నాను. మీ రిక్కడికి వచ్చాక ఆ నోటు ముక్క చూపిస్తే చాలు వచ్చింది మీరేనని రూఢి అవుతుంది. రాని పక్షంలో మాత్రం కలిసివచ్చే అదృష్టాన్ని చేజేతులా పోగొట్టుకోగలరని మరో మారు గుర్తుజేస్తున్నాను. మీరు రాకుంటే నాకే నష్టమూలేదు. నష్టపోయేది మీరే!

ఉంటాను—

వచేలరావు.'

ఉత్తరం ముగించిన షీల యింకా ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే గదిలో కాలింగ్ బెల్ మోగింది.

"ఎస్, కమిన్!" అంది తలుపువైపు చూస్తూ.

డోర్ తోసుకుంటూ డిటెక్టివ్ ఉత్తమకుమార్ అసిస్టెంట్ సంజయ్ వచ్చాడు లోనికి. రెండు నెలల క్రితం వాళ్ళిద్దరికీ 'విచిత్ర నరకులు' అనే కేసులో పరిచయమైంది. ఆ పరిచయం కాస్తా ఈ రెండు నెలల వ్యవధిలో మంచి స్నేహంగా మారి, తీరుబడి ఉన్నప్పుడల్లా అడపాదడపా కలుసుకుంటూ ఉంటారు.

"హాయే, సంజయ్! రా, సమయానికి వచ్చావ్!" అంటూ అతను సోఫాలో కూర్చున్నాక, ఆ ఉత్తరాన్నందిస్తూ, "చదువు!" అంది షీల.

దాన్ని సాంతం చదివి ఆశ్చర్యపోతూ, "ఎవరీ కుచేలరావు?" అడిగేడు సంజయ్.

"అర్థంలేని ప్రశ్న! అందులో స్పష్టంగా రాసుంది కదా, అతనికీ నాకూ ఎటువంటి పరిచయమూ లేదని!"

"ఐతే, ఏం నిర్ణయించుకున్నావ్?"

"కేసు చాలా ఇంట్రస్టింగా వుంది. వెళ్ళాలనే అనుకుంటున్నాను."

"ఒంటరిగానా?"

"ఆ ఎనభైఏళ్ళ ముసలాడు నన్నేం చేస్తాడులే!" అంది షీల నవ్వుతూ.

"నిన్ను చూస్తే ఎనభైఏళ్ళవాడే కాదు, నూరేళ్ళ ముసలాడుకూడా ఇరవైఏళ్ళ పడుచువాడయ్యే ప్రమాదముంది. ఐనా అతను రాసిందంతా నిజమేననీ, అతనికి ఎనభైఏళ్ళేనని ఏమిటి నమ్మకం? నిన్నక్కడికి రప్పించడానికి రాసిన హక్స్ కూడా కావచ్చు కదా? పైగా ఆ యిల్లు మద్రాసుకు మూడుమైళ్ళ దూరాన ఉందని గుర్తుంచుకో!"

"ఔను. లోలోపల నాకూ అనుమానంగానే ఉంది.

ఆల్ రైట్! యిప్పుడు నీ వేదైనా కేసులో పని చేస్తున్నావా?"

"కేసులేవీ లేవు గనకే నిన్ను బోర్ కొట్టిద్దామని ఇక్కడ తగలడ్డాను. ఉత్తమ్‌కుమార్ గారు పనిమీద హైదరాబాద్ వెళ్ళారు!"

"ఐతే, నువ్వు నా వెంట రారాదూ?"

"అతను ఆహ్వానించింది నిన్నొక్కడా న్నే కదా?"

"అక్కడికెళ్ళాక సర్ది చెబుతాలే. ఒంటరిగా రావడం ఇష్టంలేక నిన్ను వెంటబెట్టుకొచ్చానని."

"రావడానికి నాకేం అభ్యంతరంలేదు. ఐతే ఎప్పుడు ప్రయాణం?"

"నేనిప్పుడు సెలవుమీదే ఇంట్లో ఉన్నానుకదా? ఈ రోజే బైలుదేరదాం!"

"ఓ. కే! మధ్యాహ్నం రెండు గంటలకల్లా రెడీగా ఉండు. కారు తీసుకొస్తాను..." అంటూ లేచాడు సంజయ్.

2

సాయంత్రం సరిగ్గా ఐదు గంటలకు గ్రాస్‌ప్యాలెస్ చేరుకుంది కారు.

వంగతూర్‌కి అరమైలు ఇవతలే, ఓ నిర్మానుష్యమైన ప్రదేశంలో ఉంది ఆ పురాతన భవనం! మేన్‌రోడ్డుని కలుపుతూ అక్కడికెళ్ళడానికి ఓ మట్టిరోడ్డు వేసి ఉంది. రోడ్డు కిరుపక్కలా మొలచిన ముళ్ళకంప.

భవనం ముందు విశాలమైన, ఎత్తైన ప్రహారీ ఉంది. గేటుగుండా కాంపౌండ్‌లోకి కారుని పోనిచ్చేడు సంజయ్.

ఎన్నో ఏళ్ళుగా ఆ భవనానికి సున్నం వెయ్యనట్లూ,

శ్రద్ధ తీసుకోనట్టూ గోడలన్నీ కమిలిపోయాయి. అక్కడక్కడే చెట్లుకూడా మొలిచాయి గోడల్లో. ఆంగ్లేయుల కాలంనాటి కట్టడాన్ని జ్ఞప్తికి తెస్తోంది భవనం. పైన ప్రతి గది మీదా పొగ చూరు గొట్టాల్లాటివి కట్టి ఉన్నాయి.

పోర్టికోలో కారాపి దిగారు ఇద్దరూ.

సింహద్వారం మూసివుంది. దాని తలుపులు చెక్కతోనే తయారైనా, వాటిమీద నగిషీలు చెక్కిన ఇత్తడి రేకులు తాపడంజేసి వున్నాయి. తలుపు కుడిపక్క లావుపాటి ఇత్తడి గొలుసు వేళాడుతోంది. దాని చివర సింహం తల అమర్చి వుంది.

“బహుశా, ఈ గొలుసు లాగితే లోపల గంట మోగుతుందేమో!” అన్నాడు సంజయ్ సింహం తల అందుకుంటూ.

“అంటే, లోపల కరెంట్ లేదన్నమాట! పాపం ఈ కుచేలరావింకా ద్వాపరయుగంలో వున్నాననుకుంటున్నాడేమో!” అంది షీల ఆశ్చర్యంగా చుట్టూ కలయజూస్తూ.

సంజయ్ మారు మాటాడకుండా గొలుసు పట్టుకుని రెండు మూడుసార్లు లాగేడు. అంతే, లోపల చెవులు చిల్లులుపడే గంట శబ్దం వినిపించింది. ఎవ్వరో గబ గబ ద్వారం దగ్గరికి వస్తున్న అడుగుల ధ్వని. తలుపు తెరుచుకుంది.

ముప్ఫై ఏళ్ళుంటాయతనికి. నల్లగా, గున్న ఏనుగులా ఉన్నాడు. గుడ్లగూబలాటి కళ్ళు. లావుపాటి పెదాలు. కండలు తిరిగిన చేతులు.

“ఏం కావాలి?” అడిగేడు.

"కుచేలరావుగారున్నారా?"

తలూపాడు మౌనంగా.

షీల ఓ అడుగు ముందుకేసి, "నా పేరు షీల! కుచేల రావుగారు నన్ను ఆహ్వానిస్తూ ఉత్తరం రాశారు..." అంది.

ఆమె పేరు వినగానే అతని కళ్ళు మెరిశాయి. "మీరు లోపలికి రావచ్చు!" అన్నాడు తలుపు కడ్డం తొలుగుతూ.

"ఇతను నా కజిన్! నాకు తోడుగా వచ్చాడు" అంది షీల సంజయ్‌ని చూపుతూ.

అతను అనంగీకారంగా తల అడ్డం తిప్పి, "షీల అనే యువతిని తప్ప మరెవ్వర్నీ లోపలికి రానివ్వద్దని చెప్పారు బాబుగారు" అన్నాడు.

"ఐతే మీ అయ్యగారితో చెప్పు! ఇతను కూడా రానిదే నేను లోపలికి రానని" అంది ఎర్రబడ్డ మొహంతో.

అతను క్షణం ఆలోచించి, "సరే, ఆయన్ని కనుక్కొస్తాను. మీకు పంపిన వెయ్యి రూపాయలనోటు ముక్క తెచ్చారా?" అడిగాడు చెయ్యి చాపుతూ.

షీల తలూపి, వేనిటీబ్యాగ్ లోంచి నోటు ముక్క తీసిచ్చింది. దాన్నందుకుని లోపలికెళ్ళిపోయాడతను.

"ఈ పరిసరాలూ, ఇక్కడ రాజ్యమేలుతున్న నిశ్శబ్దమూ నీలో ఎటువంటి అనుభూతిని కలిగిస్తున్నాయి?" అడిగేడు సంజయ్ చుట్టూ కలయజూస్తూ.

"చెప్పలేని భయాన్ని రేకెత్తిస్తున్నాయి...!" అంది షీల.

అంతలో ఆ గున్న ఏనుగు మళ్ళీ వచ్చాడు. "అయ్యా

గారు ఈయన్ని కూడా లోపలకు తీసుకురమ్మన్నారు. మీ సామానెక్కడ?''

కారు డిక్కీవైపు సైగచేశాడు సంజయ్. అతను గబగబ వెళ్ళి, డిక్కీలోంచి సూట్ కేస్, ఎర్ బ్యాగ్ అందుకుని, ''నా వెంటరండి!'' అంటూ లోనికి దారితీశాడు.

అతని వెనక విశాలమైన హాల్లో అడుగుపెట్టి చకితులయ్యారిద్దరూ.

బ్రాస్ ప్యాలెస్ నిజంగా బ్రాస్ ప్యాలెసే! లోపలున్న వస్తువులన్నీ దాదాపు బ్రాస్ తో తయారుచేసినవే. ఫర్నిచరంతా పాతకాలానిదే అయినా, అన్నిటికీ యిత్తడి రేకులు తాపడంచేసి వున్నాయి.

గోడలకు వేళాడే నిలువెత్తు పటాల ఫ్రేములన్నీ ఇత్తడితో తయారుచేసినవే. అక్కడక్కడా ఎలక్ట్రిక్ బల్బులు వేళాడుతున్నాయి. వాటిపైన కప్పులన్నీ ఇత్తడివే. అంటే, ఇంట్లో ఎలక్ట్రిసిటీ వుందన్నమాట. చలికాచుకోడానికి ఆ రోజుల్లో గోడలమధ్య ఏర్పాటు చేసుకునే కుంపటిలోని మంట సెగదోయడాని కుపయోగించే రాడ్ కూడా ఇత్తడిదే కావటం మరో విచిత్రం!

హాల్లోంచే పైకెళ్ళడానికి మెట్లున్నాయి. అతను వాళ్ళిద్దర్నీ మెట్లగుండా పైకి తీసికెళ్ళి, ''మీ గది ఇదే!'' అన్నాడు తలుపులు తెరిచున్న ఓ గది చూపుతూ.

ఆ గదిలో ప్రవేశించి మరోసారి నోళ్ళు తెరిచారు వాళ్ళు. అక్కడ అమర్చివున్న వస్తువులు కూడా దాదాపు ఇత్తడితో తయారుచేసినవే! మంచంకోళ్ళు కూడా ఇత్తడివే కావడం మరో విడ్డూరం!

''ఇద్దరం యీ గదిలోనే వుండాలా?'' అడిగాడు సంజయ్.

''ఆవిడ వెంట మీరు వస్తున్నారని నాకేం తెలుసు?

మీ కోసం పక్క గది శుభ్రం చేస్తాను" అంటూ సామాను ఆ గదిలో పెట్టి వెనుతిరిగాడతను.

"నీ పేరు తెలుసుకోవచ్చా?"

"వెంకపదం!"

"కుచేలరావుగార్ని మేమెప్పుడు కలుసుకోవాలి?"

"రాత్రి ఎనిమిది గంటలకు డైనింగ్ హాల్లో ఆయనే స్వయంగా మిమ్మల్నందర్నీ కలుసుకుంటారు!"

"అందర్నీ అంటే, మాతోబాటు మరికొంత మంది ఆహ్వానించబడ్డారా?"

"ఔను. మరో ఐదుమంది వున్నారు. అందరూ ఇంత క్రితమే వచ్చేశారు" అంటూ బైటికి నడిచాడు వెంకపదం.

షీలా, సంజయ్‌లు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"ఆ కుచేలరావుకు ఇత్తడి ఫోబియా వున్నట్టుంది. ఇంట్లో ఏ వస్తువు చూసినా ఇత్తడిదే!" అంటూ మంచాన్ని సమీపించాడు సంజయ్.

దాని కాళ్ళు పూర్తిగా ఇత్తడివో, లేక వాటిమీద ఇత్తడిరేకులు అతికించారో చూద్దామని మంచాన్ని కదిలించి నివ్వెరబోయాడు. అంగుళం కూడా కదల్లేదు మంచం! నేలలో పాతేసివున్నాయి దాని కాళ్ళు.

"సంజయ్! అటు చూడు" అంటూ గోడవైపు సైగ చేసింది షీల.

తలెత్తి అటు చూశాడు సంజయ్. గోడలకు తగిలించి వున్న పటాల ఫ్రేంలన్నీ ఇత్తడివే అయినా, అవి మూలలకు వేలాడదీయబడి లేవు. ఏకంగా గోడల్లోనే బిగించి వున్నాయి.

"పాపం ఆ మహానుభావుడీ ఇత్తడిని ఎక్కడైనా

ఎత్తుకుపోతారన్న భయంకొద్దీ ఈ ఏర్పాట్లు చేశారేమో!" అన్నాడు సంజయ్ నవ్వుతూ.

అంతలో వెంగపదం తిరిగివచ్చి "మీ కోసం పక్కగది శుభ్రంచేశాను. వెళ్ళి రెస్టుతీసుకోండి. సరిగ్గా ఎనిమిది గంటలకి డైనింగ్ హాల్లోకి వచ్చేయ్యండి" అన్నాడు.

తన ఏర్ బ్యాగ్ అందుకుని పక్కగదిలోకి నడిచాడు సంజయ్.

అప్పటికే చీకట్లు ముసురుకున్నాయి. వెంగపదం ఓ పెద్దలాంతర్ వెలిగించి తెచ్చి, షీల గదిలోని బల్లమీద పెట్టి వెళ్ళాడు. ఇంట్లో ఎలక్ట్రిక్ బల్బులుండగా అవెందుకు వాడుతున్నారో అర్థం కాలేదామెకు. ఐనా, అతన్నడగడం యిష్టంలేక ఊరుకుంది.

ఆ గదిలోనే బాత్‌రూం కూడా అటాచ్ చెయ్యబడింది. తలుపుమూసి, టవల్, సోప్ అందుకుని అటు నడిచింది. అక్కడా ఇత్తడి మయమే! స్నానం కానిచ్చి, చీర మార్చుకుంటుండగా, చెవులు చిల్లులుపడే భయంకర శబ్దంతో భవనమంతా మారుమోగింది. ఉలిక్కిపడి అటూ ఇటూ కలయజూసింది షీల. కింద మూడుసార్లు మ్రోగిన గంటశబ్దం అది!

అంతలో "డిన్నర్ టైమయింది. డైనింగ్ హాల్లోకి రండి!" అన్న వెంగపదం కేకతో, ఇక్కడీ విచిత్ర పద్ధతి అమల్లో వుందన్నమాట అనుకుంటూ గబగబ తయారై తలుపు తెరిచి పక్కగదివైపు వెళ్ళింది.

అంతలో సంజయ్ కూడా ఇవతలికి వచ్చాడు. వెంగపదం వాళ్ళని వెంటబెట్టుకుని కింద ఓ పక్కవున్న డైనింగ్ హాల్లోకి తీసికెళ్ళాడు.

3

అప్పటికే మిగతా ఐదుగురు అతిథులూ వచ్చి ఆసీనులై వున్నారక్కడ.

వెంగపదం వాళ్ళనక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు. విశాలమైన ఆ డైనింగ్ టేబుల్ కుడిపక్క ఖాళీగావున్న రెండు కుర్చీల్లో ఆసీనులయ్యారిద్దరూ. మిగతా అతిథులు కన్నార్పకుండా వాళ్ళనే చూస్తున్నారు.

అంతవరకూ తానొక్కర్తే స్త్రీ అతిథి అనుకుంటున్న షీల భయం తొలగిపోయింది. కారణం, అక్కడ కూర్చున్న మిగతా ఐదుగురిలో ఒక నడివయసు స్త్రీ, ఒక అందమైన యువతి కూడా వున్నారు. మిగతా ముగ్గురూ మగవాళ్ళు. అందరూ నలభైలోపు వయస్కులే.

షీల ఆలోచనా స్రవంతికి ఆనకట్ట వేస్తూ, ముఫైఏళ్ళ ఓ ఫుల్ సూటతను లేచి నిల్చుని కంఠం సర్దుకున్నాడు.

“లేడీస్ అండ్ జంటిల్ మన్! మనమంతా పరస్పరం అపరిచితులమని వేరే చెప్పనవసరం లేదు. దిష్టిబొమ్మల్లా ఒకర్నొకరు చూసుకుంటూ కూర్చునేబదులు, ఒకరి తరువాత ఒకరు తమతమ పరిచయాలు మిగితా వాళ్ళకి తెల్పితే మొహమాటం తొలగి, అందరిమధ్యా సభ్యత ఏర్పడే అవకాశం వుంటుందని నా అభిప్రాయం!

ముందు నన్ను నేను పరిచయం చేసుకుంటాను. నా పేరు డాక్టర్ ఆనంద్! మద్రాసులో ప్రాక్టీస్ చేస్తున్నాను. రెండురోజుల క్రితం ఈ ఇంటి యజమాని కుచేలరావుగారి దగ్గర్నించి నాకో ఉత్తరం వచ్చింది. దానితోపాటు ఓ వందరూపాయల నోటూ, సగం చించిన వెయ్యి రూపాయల నోటుముక్కా వున్నాయి. ఉత్తరంలో నన్నిక్కడికి వచ్చి, కొన్నాళ్ళు తన అతిథిగా వుండవలసిందిగా కోరారాయన. విషయం చాలా ఆసక్తి

కరంగా తోచి, ఏమిటో కనుక్కుందామనే కుతూహలంతో బైలుదేరి వచ్చేశాను” అంటూ తిరిగి కుర్చీలో కూర్చున్నాడతను.

అతని తరవాత రెండో వ్యక్తి లేచినిల్చున్నాడు. అతనికి దాదాపు ముప్పైఎనిమిదేళ్ళుంటాయి. సన్నగా పొడుగ్గా వున్నాడు. కళ్ళకి అద్దాలు.

“ఫ్రెండ్స్! నా పేరు నారాయణశర్మ. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసులో చీఫ్ ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. డాక్టర్ ఆనంద్‌గారిలాగానే నేను కూడా కుచేలరావుగారి ఆహ్వానంపై తిరుపతి నించి భార్యాసమేతంగా వచ్చానిక్కడికి. ఈమె నా భార్య సత్యవతి!” అంటూ పక్కనే కూర్చున్న నడివయసు స్త్రీని పరిచయం చేశాడతను.

ఆమెకు ముప్పైఐదేళ్ళుంటాయి. ఎర్రగా, లావుగా వుంది.

ఆ తరవాత సుమారు ముప్పైఏళ్ళున్న మరొకతను లేచి నిల్చున్నాడు. ఇతను డాక్టర్ ఆనంద్‌కన్నా స్మార్ట్‌గా చార్మింగ్‌గా వున్నాడు. ఉంగరాల జుత్తు, కోటేరు ముక్కు.

కంఠం సర్దుకుని, “ఫ్రెండ్స్ నా పేరు హరనాథ్. రాజమండ్రి డిగ్రీకాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. వివాహితుణ్ని. ఐనా, విధి వైపరీత్యంవల్ల మళ్ళా బ్రహ్మచారి జీవితం చవిచూస్తున్నాను. కారణం రెండేళ్ళ క్రితం నా భార్య తొలిప్రసవంలోనే ఈ లోకానికి నమస్కారం పెట్టేసింది.

మిగతా ఇద్దరిలాగే నాకూ కుచేలరావుగారి ఆహ్వాన లేఖ అందడంతో మానవసహజమైన కుతూహలాన్ని ఆపుకోలేక, బైలుదేరి వచ్చాను” అన్నాడు.

ఈసారి అందరి కళ్ళూ ఆ అందమైన యువతి మీదికి మళ్ళాయి. దాంతో ఆ పిల్ల రవంత సిగ్గుపడుతూ లేచి నిల్చుంది. ఇరవై, ఇరవై ఒకటి వుంటుంది వయసు. గులాబీరేకల్లాంటి పల్చటి పెదాలు. లేడికూనలాటి చారడేసికళ్ళు. దానిమ్మ ముక్కలాటి నున్నని చెక్కిళ్ళు.

"నా పేరు కార్తీక! ఇండియన్ ఏర్‌లైన్స్‌లో ఏర్ హోస్టెస్‌గా పనిచేస్తున్నాను. ఈ మధ్యే బెంగళూర్ నించి బేగంపేట విమానాశ్రయానికి బదిలీ అయింది. మీలాగే నాకూ కుచేలరావుగారి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. ఉండబట్టలేక ఆసక్తికొద్దీ బైలుదేరాను" అంటూ కూర్చుంది.

ఈ సారి అందరి కళ్ళూ షీలా, సంజయ్‌లవైపు మళ్ళాయి. షీల లేచినిల్చుని తనని పరిచయం చేసుకుంది. ఆఖర్న సంజయ్ లేచి తన వివరాలు చెప్పుకున్నాడు. వృత్తివిషయంలో మాత్రం తాను డిటెక్టివ్ ఉత్తమ్ కుమార్ అసిస్టెంట్‌నని గాక ఇంకేదో చెప్పాడు.

"ఇప్పుడు మనమధ్య పరస్పర పరిచయాలయ్యాయి కదా? ఇక నేను మిమ్మల్నొక ప్రశ్న అడగదలచాను. కుచేలరావుగారి దగ్గర్నించి మీ అందరికీ ఆహ్వానలేఖలందాయి. ఆయనకూ, మీకూ పూర్వపరిచయాలేమైనా వున్నాయా?" అడిగాడు సంజయ్ అందర్నీ కలయజూస్తూ.

"లేదు. ఆయన్ని మేమింతవరకూ చూళ్ళేదు" అన్నారంతా, ముక్తకంఠంతో.

"ఐతే, ముక్కూ మొహం తెలియని మనందర్నీ ఆయన ఏ ఉద్దేశంతో ఇక్కడికి ఆహ్వా..."

"అందర్నీ కాదు, కేవలం ఐదుగుర్ని..." అన్న

కంచుకంఠం విని, అందరూ ఉలిక్కిపడి తలుపువైపు చూశారు.

వెంగపదం!

అతనొక్కడే లేడక్కడ. అతని పక్కన ఓ పండు వృద్ధుడు నిల్చునున్నాడు. వెంగపదం ఆ ముసలాణ్ణి పొదవి పట్టుకుని నిల్చునున్నాడు. ఎనభైఏళ్ళుంటాయా వృద్ధుడికి. ఖరీదైన సూటు. అస్థిపంజరానికి తొడిగించినట్లుంది. అతని ఒంట్లో మాంసానికి బదులు ఎముకలే ఎక్కువ వుండివుంటాయి. వెండిలా పండిన తల. కళ్ళకి రిమ్‌లెస్ కళ్ళజోడు. చేతిలో హాండ్ స్టిక్!

అతన్ని చూడగానే అతిథులందరి మనసులో ఒకేఒక భావం తళుక్కుమంది.

కుచేలరావు!

"వెంగపదం! అతిథులందరూ ఉన్నట్లే కదా ఇక్కడ?" అడిగాడా వృద్ధుడు.

"ఔనండి!" వినయంగా జవాబిచ్చాడు వెంగపదం.

"లేడీస్ అండ్ జంటిల్ మన్! నేను ఒక్కొక్కర్నీ పేరుపెట్టి పిలుస్తాను. దయచేసి బదులివ్వండి... డాక్టర్ ఆనంద్!" పిలిచాడు కుచేలరావు.

"ఎస్ సర్!"

"నేను బడిపిల్లల అటెండెన్స్ తీసుకోడంలేదు. పేరు పెట్టి పిల్చాక దయచేసి మీరు ఏదో ఒకటి మాట్లాడాలి. అప్పుడే నాకు మీ కంఠాలు గుర్తుంటాయి. వృద్ధాప్యమూ, అనారోగ్యమూ నా కంటిచూపు యిగిర్చివేశాయి" అన్నాడు కుచేలరావు అభ్యర్థిస్తూ.

"నా పేరు డాక్టర్ ఆనంద్. మీ ఆహ్వానం అందగానే మద్రాసునించి వచ్చాను."

"థాంక్స్! కార్తీకా."

"ఎస్ సర్! నా పేరు కార్తీక. మీ ఉత్తరం చూడగానే బేగంపేట నించి హుటాహుటిన బైలుదేరి వచ్చాను."

కుచేలరావు అలా ఒక్కొక్కర్ని పేరుపెట్టి పిలవసాగాడు. అందరూ అతను కోరినట్లు జవాబులిచ్చారు.

"మీరంతా నా ఆహ్వానాన్ని మన్నించి దూరదూర ప్రదేశాలనించి వచ్చిందుకు థాంక్స్! వెంగపదం! ఇక నన్ను నా సీట్లో కూర్చోబెట్టు" అన్నాడు కుచేలరావు.

వెంగపదం అతని చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ వచ్చి, ఇత్తడితో ప్రత్యేకంగా తయారుచేసిన కుర్చీలో కూర్చోబెట్టి చేతులుకట్టుకు నిల్చున్నాడు. ఆ పండు ముసలి తమనెందుకు ఆహ్వానించాడో తెల్సుకుందామని అందరి గుండెలూ కొట్టుకుంటున్నాయి క్యూరియాసిటీతో.

రెండునిమిషాల నిశ్శబ్దంగా కూర్చుని తలెత్తాడు కుచేలరావు. "డియర్ ఫ్రెండ్స్! ముక్కూ మొహం తెలియని మిమ్మల్ని నేనెందుకిలా ఆహ్వానించానో తెలుసుకుందామని మీరెంత ఆరాటపడుతున్నారో నేనర్థం చేసుకోగలను.

ఇక అసలు విషయం! మా వంశంలో ఇప్పుడు మిగిలి వున్న వాణ్ణలా నేనొక్కణ్ణే! ఒకప్పుడు మా వంశం ఇత్తడి వ్యాపారంలో దేశంలోకల్లా పేరు గాంచింది. స్వాతంత్ర్యం వచ్చాక క్రమేపీ మా ఇంపాయర్ పల్చబడసాగింది. మాకు పోటీగా ఎందరో తలెత్తారు. దాంతో, క్రమక్రమంగా మా వ్యాపారం దెబ్బతినసాగింది.

అనారోగ్య కారణాలవల్ల నా చేతుల్లో వ్యాపారం పూర్తిగా చతికిలబడిపోయింది. విసుగెత్తి పదేళ్ళక్రితం నేనే మా కంపెనీ దివాలాతీసినట్టు ప్రకటించి, మా

తాత ముత్తాతల కాలంనాటి ఈ భవనంలో విశ్రాంతి తీసుకుంటున్నాను.

కంపెనీ దివాలాతీసిందని ప్రకటించినంత మాత్రాన నేను పూర్తిగా దివాలాకోర్ని కాలేదు. ఏనుగు బ్రతికి వున్నా, చచ్చినా లక్షరూపాయలు విలువచేస్తుందన్న సామెత మీరు వినేవుంటారు. అలాగే నా వ్యక్తిత్వం ఇప్పుడు అరవైలక్షల రూపాయలు విలువ చేస్తుంది!

ఇక మిమ్మల్ని పిలవడానికి కారణం చెబుతాను వినండి. ఈ మధ్య నా ఆరోగ్యం మరీ క్షీణించింది. నా తరవాత అరవైలక్షలకన్నా ఎక్కువ విలువచేసే ఈ ఆస్తి పాస్తులకు వారసులెవ్వరు? ఈ అపార సంపత్తిని అనుభవించేదెవ్వరు? అన్న దిగులు నన్ను ప్రతిక్షణం వేధించడం ప్రారంభించింది.

నా లాయర్ కాంతిప్రకాశ్‌తో కలిసి, బాగా ఆలోచించి, ఈ పథకం అమలుపెట్టాను. ఆ పథకంలోని భాగమే, మీ ఐదుగుర్ని ఆహ్వానించడం! నిజానికి నేను ఆహ్వానించదలచుకున్న వ్యక్తులు మొత్తం ఏడుగురు!!

ఆరా తియ్యగా అందులో ఒకరు చాలా రోజుల క్రితమే చనిపోయినట్లు తెలిసింది. మరొకరి కోసం ఎంత గాలించినా ఆచూకీ లభించడంలేదు. అతనికోసం ఇంకా వెతికిస్తూనే వున్నాను. ఎందుకో తెలుసా? నా మరణానంతరం, అరవైలక్షలు విలువచేసే నా ఆస్తిపాస్తులకు వారసులుగా మీలోనే ఎవ్వరో ఒకర్ని ఎన్నుకోవాలి.

ఒక్కర్నే అన్న నియమం ఏమీలేదు. ఇద్దర్ని కూడా ఎన్నుకోవచ్చు. నలుగుర్ని కూడా ఎన్నుకోవచ్చు. లేదా, అందరికీ సమానంగా పంచవచ్చు. అదంతా నా ఇష్టా ఇష్టాలమీద ఆధారపడుంది.

దేశంలో డెబ్భైకోట్ల జనాభా వుండగా, నేను మీ

ఏడుగురినే ఎందుకు ఎన్నుకున్నానా అని ఆశ్చర్య పోతున్నారు కదూ? కారణం లేకపోలేదు. నా గత జీవితంలో మీ తలిదండ్రులు ఏదో ఒక సందర్భంలో నా ప్రాణాలు కాపాడి పుణ్యం కట్టుకున్నారు.

విచారకర విషయమేమిటంటే, ఆనాడు ప్రాణదాత లైన మీ తలిదండ్రుల్లో ఏ ఒక్కరూ ఇప్పుడు జీవించి లేరు. నిజమేనా?'' అడిగాడు కుచేలరావు అందర్నీ కలయ జూస్తూ.

అందరూ తలలూపారు ఒకేసారి!

''అందుకే ఆ పుణ్యమూర్తుల సంతానమైన మీకు ఈ విధంగా మేలుజేసి, నా ఋణభారాన్ని దించుకోదల చాను. మీ తలిదండ్రులు నా కేవిధమైన మేలు జేశారో తెలుసుకోవాలని కుతూహలపడుతున్నారుకదూ? చెబుతా వినండి.

మిస్టర్ నారాయణవర్మా! మీ నాన్నగారూ, నేనూ ఒకే ఈడువాళ్ళం. సహాధ్యాయులం. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో ఒక విద్యార్థితో నాకు బదవిరోధం ఉండేది. ఒక రాత్రి నేనూ, మీ నాన్నా సెకండ్ షో సినిమా చూసి వస్తుండగా, ఆ విద్యార్థి, నలుగురు గుండాలని వెంటబెట్టుకొని నామీద దాడి జేశాడు. అప్పుడు మీ నాన్న ఆ రౌడీలతో హోరాహోరీ పోరాడి నా ప్రాణాలు రక్షించాడు.

మిస్ షీలా! మీ నాన్నగారు ఆ రోజుల్లో గొప్ప డాక్టర్ గా పేరు పొందారు. ఒకప్పుడు నేనొక మొండి వ్యాధికి గురయ్యాను. ఎందరో డాక్టర్లు వైద్యంజేసి, నయంజెయ్యలేకపోయిన ఆ జబ్బును మీ నాన్నగారు ఎంతో నేర్పుతో చికిత్సజేసి రూపుమాపారు. ఆ విధంగా నాకు పునర్జన్మ ప్రసాదించారు.''

షీల ఉలిక్కిపడి ఏదో చెప్పడానికి నోరు తెరిచింది. సంజయ్ మెరుపులా ఆమె చెయ్యినొక్కి మాట్లాడవద్దని సైగ చేశాడు. అవేమీ గమనించకుండా తన ధోరణిలో చెప్పుకుపోతున్నాడు కుచేలరావు.

“మిస్టర్ హరనాథ్! మీ అమ్మా, నేనూ కాలేజిలో చదువుకునేవాళ్ళం! ప్రతి కాలేజీ కుర్రాడి హృదయం లోనూ, యెవ్వరో ఒక విద్యార్థిని చెరగని ముద్ర వేసుకోడం, ఆ తియ్యని స్మృతులు ఆజన్మాంతం అతని హృదయంలో పదిలంగా నిలిచిపోవడం సహజం!” అంటూ భారంగా నిట్టూర్చి, “పోనివ్వు! ఈ వయసులో అటువంటి గతాన్ని తిరగదోడటం హాస్యాస్పదమే... మొత్తానికి నువ్వు ఏ వ్యక్తి కడుపునైతే పుట్టావో ఆ వ్యక్తి జ్ఞాపకాలు యిప్పటికీ నాలో స్థిరంగా మిగిలి వున్నాయి” అంటూ క్షణం ఆగాడు కుచేలరావు.

అందరి కళ్ళూ అప్రయత్నంగా లెక్చరర్ హరనాథ్ వైపు మళ్ళాయి. అందరి మస్తిష్కంలోనూ ఒకే ఒక ఆలోచన కదులుతోంది. బహుశా, కుచేలరావు చదవుకునే రోజుల్లో హరనాథ్ తల్లిని ప్రేమించి ఉంటాడు!

కుచేలరావు కంఠం ఖంగుమంది మళ్ళీ. “మిస్ కార్తీకా! మీ నాన్నగారు ఆ రోజుల్లో పోలీస్ సబిన్స్పెక్టర్‌గా పనిచేసేవారు. ఒకప్పుడు నేనో హత్యకేసులో ఇరికించబడ్డాను. సాక్ష్యాలన్నీ నాకు విరుద్ధంగా సృష్టించబడ్డాయి. పోలీసు ఉన్నతాధికార్లంతా ఆ హత్య నేనే చేశానని నమ్మినా, మీ నాన్న మాత్రం అది నమ్మక, అహో రాత్రులూ శ్రమించి, పరిశోధించి అసలు హంతకుణ్ణి పట్టుకుని, నా కంఠానికి ఉరితాడు బిగుసుకోకుండా కాపాడారు.

డాక్టర్ ఆనంద్! ఒకప్పుడు నేను తీవ్రంగా జబ్బుపడి ఒక శానిటోరియంలో అడ్మిటయ్యాను. అప్పుడు మీ అమ్మ నాకు యెంతో ఆత్మీయంగా, శ్రద్ధగా శుశ్రూషలు చేసి, మళ్ళీ పునర్జన్మ ప్రసాదించింది. ఆమె సేవల ఫలితంగానే నేను లేచి తిరగగలిగే యోగ్యత సంపాదించాను. ఆ శానిటోరియంలో మీ అమ్మ నర్సుగా పని చేసేదని వేరే చెప్పనవసరం లేదనుకుంటాను.

ఆ విధంగా మీ మీ తలిదండ్రులు నాకు చేసిన ఉపకారాల ఫలితంగానే ఈ రోజు మీరిక్కడున్నారు. మనిషి యెవ్వరినైనా మరిచిపోగలడుగానీ, తన ప్రాణదాతలని ఎన్నడూ మరవలేడు.

దయచేసి మీరంతా పదిహేను రోజులపాటు నా అతిథులుగా యీ యింట్లో బసచెయ్యవలసిందని అభ్యర్థిస్తున్నాను. ఆ పదిహేనురోజుల్లో నేను మీ మీ మనస్తత్వాలు స్టడీ చేసి, నా ఆస్తికి ఎవర్ని వారసులుగా ఎన్నుకోవాలో నిర్ణయిస్తాను. యీ లోపల యెవ్వరైనా వెళ్ళిపోదలిస్తే నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు. అటువంటప్పుడు నా ఆస్తిలో వాళ్ళ కెటువంటి ప్రమేయం ఉండదు.

పదిహేనురోజుల తరవాత నా నిర్ణయం ప్రకటించబడుతుంది. ఆ రోజే నా లాయర్ శాంతిప్రకాశ్ సమక్షంలో విల్లు రాసేస్తాను. ఇక్కడ మీకే యిబ్బందీ ఉండదు. వెంగపదం మీ అవసరాలన్నీ చూసుకుంటాడు...

ఇక యింతకి మించి యెక్కువ మాట్లాడలేకపోతున్నందుకు క్షంతవ్యుణ్ణి. ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మీరు భోజనాలు కానిచ్చి, మీ మీ గదుల్లో విశ్రాంతి

తీసుకోండి. వెంగపదం! నన్ను తీసుకెళ్ళు" అంటూ ముగించాడు కుచేలరావు.

వెంగపదం అతన్ని లేపి, నడిపించుకుంటూ బైటికి తీసికెళ్ళాడు.

అతిథులంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అందరి కళ్ళల్లోనూ ఆ అపార ఆస్తికి ఎవరెవరు, ఏ ఏ మోతాదులో వారసులవుతారో అన్న మీమాంసా, కుతూహలం స్పష్టంగా ద్యోతకమౌతున్నాయి.

4

భోజనాలయ్యాక అందరూ మేడమీది తమ తమ గదుల్లోకి వెళ్ళిపోయారు.

సంజయ్ షీల వెంట ఆమె గదిలోకి వచ్చి, తలుపులు దగ్గరగా జేరవేసి—"ఇప్పుడు చెప్పు. కుచేలరావు నీ తండ్రి డాక్టర్ అనీ, తన ప్రాణాలు కాపాడాడనీ చెప్పినప్పుడు నువ్వు ఉలిక్కిపడ్డావ్! ఎందుకు?" అడిగాడు.

"కారణం చెప్పానంటే నువ్వు నిర్ఘాంతపోక మానవు! మా నాన్న డాక్టర్ కాదు!! రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పని చేసేవారు. కుచేలరావు అంత పచ్చి అబద్ధం ఎందుకు చెప్పాడో నా కర్థంకావడంలేదు" అంది షీలా ఆశ్చ ఆశ్చర్యంగా.

సంజయ్ భ్రుకుటి ముడిపడింది. కాసేపు ఆలోచించి, సాలోచనగా తలూపేడు, "షీలా! కుచేలరావు అబద్ధం చెప్పలేదు. అందుకు ఋజువులున్నాయి. నీ విషయం చెప్పినప్పుడు—అది అబద్ధం గనక నువ్వు ఉలిక్కిపడ్డావ్. నేను వారించకపోతే నిజం చెప్పేదానివే!

అటువంటప్పుడు మిగతావాళ్ళ మొహాల్లో ఆశ్చర్య భావాలు పొడసూపేవి. అవేమీ కాకుండా అందరూ

కుచేలరావు చెప్పిందివిని, నిజమే అన్నట్టు బుర్రలూపారు. దీన్నిబట్టి ఆలోచిస్తే, కుచేలరావుకు ఈ విషయంలోనే ఏదో పొరబాటు జరిగివుంటుందనిపిస్తోంది.

ఆయన ఈ అతిథుల వివరాలు తెలుసుకోడానికి నియమించిన వ్యక్తే ఈ విషయంలో పొరబడుంటాడు. ఇంకెవరో షీల అనే అమ్మాయిని వెతకబోయి, నిన్నే ఆమె అనుకుని కన్ఫ్యూజ్ అయుంటాడు.''

''ఒక విధంగా నీ హేతువాదం సమంజసంగానే ఉంది. కాని, మరోవైపునించి కూడా ఆలోచించాలి. కుచేలరావు యితర్ల గురించి చెప్పిందంతా నాలాగే అబద్ధమైనా వాళ్ళు కిమ్మనకుండా ఊరుకోడానికి ఆస్కారం ఉందికదా?

ఒకవేళ ఆయన చెప్పింది అబద్ధమనీ, తమ తలిదండ్రులు యింకెవ్వరో అనే నిజం బైటపెడితే ఆయన యెక్కడ వెళ్ళిపొమ్మంటాడో, ఆ విధంగా కలిసిరాబోతున్న అదృష్టం ఎక్కడ చేజారిపోతుందో అని వాళ్ళు భయపడి ఉండవచ్చు కదా?''

''ఔను. అదీ నిజమే. నిజానిజాలు తెలుసుకోడానికి ఓ పని చేద్దాం! నేను మద్రాసు క్రయింబ్రాంచి హెడ్క్వార్టర్స్‌కు ట్రంకాల్ చేసి, ఇన్స్పెక్టర్ రాజారెడ్డికి కథంతా వివరించి, ఈ అతిథుల తలిదండ్రుల వివరాలు తెలుసుకుని, వాళ్ళతో కుచేలరావుకు నిజంగా సంబంధాలుండేవో? లేదో? ఆరా తీయించమని కోరతాను. ఏమంటావ్?''

''ఐడియా బావుంది. అలాగే చెయ్యి!''

''ఈ యింట్లో టెలిఫోన్ లేనట్టుంది. అంతే కాదు, యిల్లంతా ఎలక్ట్రిక్ సర్క్యూట్ ఉండగా కరెంట్

లేకపోవడం మరో విడ్డూరం! వంగస్తూర్ ఇక్కడికి అర మైలు దూరమే. అక్కడ పోలీస్ స్టేషన్ కూడా ఉండి ఉంటుంది. రేపక్కడికెళ్ళి పోలీస్ స్టేషన్లోంచి ట్రంకాల్ చేస్తాను. ఆల్ రైట్! ఉదయం మళ్ళీ కలుసుకుందాం, గుడ్ నైట్!'' అని తన గదిలోకెళ్ళాడు సంజయ్.

తలుపులు మూసి, నైట్ డ్రెస్ తొడుక్కుని, లైటార్పి పక్కమీద వాలాడు. గడియారాన్ని దిండుకింద పెట్టి, కళ్ళు మూసుకున్నాడు. ఇంటివెనక తోటలో చెట్టుమీద కూర్చుని భయంకరంగా అరుస్తోంది గుడ్లగూబ.

కుచేలరావు గురించే ఆలోచిస్తూ నిదరలోకి జారుకున్నాడు.

అర్ధరాత్రి—

హఠాత్తుగా భవనం దద్దరిల్లేలా గావుకేక వినిపించినట్టయి, చటుక్కున కళ్ళు తెరిచాడు. చెవులు రిక్కించి అలాగే పడుకొన్నాడు. ఈసారి గొంతు పార చినిగేలా వినిపించింది పొలికేక! మేడమీద కాదు. కిందనించి!

అప్పటికే మేడమీదున్న గది తలుపులు తెరుచుకుంటున్న శబ్దాలు వినిపించాయి. కిందినించి వెంగపదం అరుస్తున్నాడు గట్టిగా. ''బాబుగార్నెవరో చంపేశారు. రండి, త్వరగా రండి.''

తలుపు తెరిచి బైట కురికాడు సంజయ్. అప్పటికే షీలతోబాటు అతిథులంతా గదుల్లోంచి బైటికి వచ్చారు. అందరూ హడావుడిగా మెట్లవెపు పరిగెత్తారు. హాల్లో నిల్చుని గుండెలు బాదుకుంటున్నాడు వెంగపదం!

''ఏం జరిగింది? ఏమైంది?'' అడిగారంతా.

''నా గది అయ్యగారి పడగ్గది పక్కనే వుంది. ఐదు నిముషాల క్రితం ఆయన గావుకేక విని, నిద్ర లేచాను. నా

గదిలోనించి బైటికి రాబోతుండగా మళ్ళీ కేక వినిపించింది. ఆయన గది దగ్గరికి పరిగెత్తి చూస్తే తలుపులు బార్లా తెరిచున్నాయి. లోపల మంచం మీద__"

"ఆయన గదెక్కడుంది?" మధ్యలో అందుకున్నాడు సంజయ్.

వెంగపదం వాళ్ళని కుచేలరావు గది దగ్గరికి తీసి కెళ్ళాడు. ఆ గదిలో అడుగు పెట్టగానే అందరూ స్థాణువులైపోయారు! మంచంమీద వెల్లకిలా పడున్నాడు కుచేలరావు. నిర్జీవంగా, చలనరహితంగా! పరుపూ,దిండూ రక్తంతో తడిసివున్నాయి.

డాక్టర్ ఆనంద్, సంజయ్‌లిద్దరూ గబగబ మంచాన్ని సమీపించారు.

అప్పుడు పడింది సంజయ్ దృష్టి, మంచానికాస్త యివతల నేలమీద పడున్న వస్తువుమీద. అది పొడవాటి ఇత్తడి రాడ్! దాని ఓ చివర మూడంగుళాల వరకూ నల్లబారి ఉంది. రక్తపు మరకలు కూడా అక్కడే ఉన్నాయి.

సడన్‌గా జ్ఞాపకం వచ్చింది సంజయ్‌కు__తానా యింట్లో అడుగుపెట్టినప్పుడు, హాల్లో ఓ పక్కగోడలో కట్టిన చలి కాచుకునే కుంపటిదగ్గర కనిపించిన రాడ్ అది. మంటను ఎగదొయ్యడాని కుపయోగించేవారు గనక దాని ముందుభాగం నల్లబారి ఉంది. బహుశా హంతకుడు కుచేలరావు తల పగలగొట్టి చంపుంటాడు.

అంతలో డాక్టర్ ఆనంద్ కుచేలరావు చెయ్యి అందుకుని పల్స్ చూసి, "థాంక్ గాడ్! ఈయనింకా బ్రతికే ఉన్నాడు. పల్స్ కొట్టుకుంటోంది. కేవలం స్పృహ

పోయింది. వెంగపదం! వెంటనే వెళ్ళి నా గదిలోంచి మెడికల్ చెస్ట్ పట్రా!'' అన్నాడు హడావుడిగా.

వెంగపదం బాణంలా బైటికి పరిగెత్తాడు.

"గాయం కడగడానికి వేణ్ణీళ్ళు పట్టుకొద్దాం! నా వెంట రండి'' అంటూ భర్త చెయ్యి పట్టుకొని బైటికి నడిచింది సత్యవతి.

నిమిషాల మీద వచ్చేశాయి మెడికల్ చెస్ట్, వేణ్ణీళ్ళు.

డాక్టర్ ఆనంద్ గబగబ కుచేలరావు నుదుటిమీది గాయాన్ని శుభ్రం చేసి, కట్టు కట్టి రక్తస్రావాన్ని ఆపేశాడు. ఆయనకింకా స్పృహ రాలేదు.

గదంతా ఓమారు కలయజూశాడు సంజయ్. ఆ గది పడమటిదిక్కున పెద్ద కిటికీ వుంది. లోపలివైపు బోల్ట్ వేసివుంది. అంటే, ఆ కిటికీగుండా బైటినించి ఎవ్వరూ రాలేదన్నమాట.

సంజయ్‌ను ఆకట్టుకున్న మరో విషయం ఏమిటంటే, ఆ యింట్లో యెటు చూసినా ఇత్తడి వస్తువులున్నమాట నిజమేగానీ ఈ గదిలో వాటి సంఖ్య ఇంకా ఎక్కువ మోతాదులో వుంది. మంచంతోసహా యెటు చూసినా ఇత్తడే! అన్నీ పాలిష్ చెయ్యబడ్డట్టు ధగధగ మెరిసి పోతున్నాయి.

సాలోచనగా తలూపి, "ఆ ఇత్తడి రాడ్ నెవ్వరూ ముట్టుకోవద్దు. దానిమీద హంతకుడి వేలిముద్ర లుండి ఉంటాయి. నే వెళ్ళి, వంగతూర్ పోలీసుల్ని పిలుచుకొస్తాను. కుచేలరావుగారిమీద హత్యాప్రయత్నం జరిగింది. ఇది పోలీసుకేసు. వాళ్ళకు ఇన్ఫర్మేషన్ ఇవ్వడం మన కనీస కర్తవ్యం!'' అంటూ షీల నక్కడే ఉండమన్నట్టు సైగచేసి బైటికి నడిచాడు సంజయ్.

బైట వున్న తను కారెక్కి, పది నిమిషాల్లో చేరు కున్నాడు ఊళ్ళోకి. పోలీస్ స్టేషన్ కనుక్కోడం కష్టం కాలేదు. అదృష్టవశాత్తూ ఇన్ స్పెక్టర్ అక్కడే ఉన్నాడు.

సంజయ్ తనని తాను పరిచయం చేసుకోగానే, "గ్లాడ్ టు మీట్ యూ మిస్టర్ సంజయ్! మీ గురించి మా డిపార్ట్ మెంట్ లో తరుచూ వింటూంటాను" హార్దిక స్వాగతం పలికాడు.

అతనికి జరిగింది వివరించి, వెంటనే కావలసిన సిబ్బందితో బైలుదేరమని కోరాడు సంజయ్. ఐదు నిమిషాల్లో సిబ్బందితో జీప్ ఎక్కాడు ఇన్ స్పెక్టర్. వాళ్ళు కుచేలరావు యింటికి చేరేలోగా, ఆ వృద్ధుడికి స్పృహ తెప్పించడంలో కృతకృత్యుడయ్యాడు ఆనంద్. అప్పటికే ఏర్ హోస్టెస్ కార్తీక కాఫీ తయారుచేసి, ఆయనచేత తాగిస్తోంది.

"ఈ రాడ్ తోనేనా హత్యాప్రయత్నం జరిగింది?" అడిగాడు ఇన్ స్పెక్టర్ కింద పడున్న ఇత్తడి కడ్డీవైపు చూపుతూ.

"ఔను. దాన్ని జాగ్రత్తగా తీసికెళ్ళి ఫింగర్ ప్రింట్స్ తీయించండి. ప్రింట్స్ గనక దొరికాయంటే హంతకుడు పట్టుబడటానికి క్షణం పట్టదు" అన్నాడు సంజయ్.

"ఎవరు? ఎవరు మాట్లాడుతోంది? ఒకరు సంజయ్ అనుకొంటాను. ఆ కో తకంఠం ఎవరిది?" అడిగాడు మంచంమీద కూర్చున్న కుచేలరావు.

"ఈయన పోలీస్ ఇన్ స్పెక్టర్! కంగత్తూర్ నించి వచ్చాడు."

"పోలీస్ ఇన్ స్పెక్టరా? నా యింట్లో పోలీసులకేం

పని?'' కుచేలరావు నోటినించి వెలువడ్డ ఆ మాటలు అందర్నీ చకితుల్ని చేశాయి.

"అదేమిటి రావుగారూ? మీమీద హత్యాప్రయత్నం జరిగింది. ఆ దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తిని పట్టుకోడం పోలీసుల కర్తవ్యం కాదా?'' అన్నాడు సంజయ్ ఆశ్చర్యంగా.

"వీళ్ళనెవరు పిల్చారిక్కడికి?''

"నేనే!''

"మిస్టర్ సంజయ్! ఇది నా యిల్లు. ఇక్కడ నా అనుమతి లేనిదే ఏ పనీ జరగడానికి వీల్లేదు. నా యింటి చుట్టూ పోలీసులు తిరగడం నా కిష్టం ఉండదు. నామీద హత్యాప్రయత్నం జరిగింది. నిజమే! ఐనా, నేనింకా బ్రతికే ఉన్నాను. అటువంటప్పుడు ఈ గొడవంతా యెందుకు? ఒకవేళ నా ప్రాణాలు పోయుంటే అప్పుడు మీరేంచేసుకున్నా నా కభ్యంతరం ఉండేదికాదు. ఇన్ స్పెక్టర్! దయచేసి మీరిక వెళ్ళొచ్చు'' అన్నాడు కుచేలరావు నిర్మొహమాటంగా.

ఇన్ స్పెక్టర్ మొహం జేవురించింది. "సరే మీకు మా సహాయం అవసరం లేకుంటే, తరవాత మమ్మల్ని నిందించవద్దు'' అంటూ విసవిస బైటికి నడిచాడు.

అతని వెనకే సంజయ్ కూడా ఇవతలికి వచ్చాడు.

"ఆ ముసలాడికి పిచ్చిగానీ ఉందేమిటి!'' అన్నాడు ఇన్ స్పెక్టర్ మొహం చిట్లిస్తూ.

"పిచ్చిలేదుగానీ, అలా యెందుకు ప్రవర్తించాడో నా కర్థంకావడంలేదు. మొత్తానికి ఏదో వుంది రహస్యం! అయామ్ సారీ ఇన్ స్పెక్టర్. నావల్ల మీకీ విధంగా అవమానం జరిగింది!''

"డోంట్ వర్రీ! నా సహాయ సహకారాలు మీకెప్పుడూ ఉంటాయి. ఏది ఏమైనా, ఈ పరిస్థితుల్లో త్వరలోనే మరో సంఘటన జరగవచ్చని నా అనుమానం! మీరు కాస్త జాగ్రత్తగా ఉండటం మంచిది!"

సంజయ్ తలూపి, "ఆల్ రైట్! మీ వెంట నేనూ పోలీస్ స్టేషన్ వస్తున్నాను. అక్కణ్ణించి మద్రాసుకు ట్రంకాల్ జేసి, క్రయింబ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డితో కాస్త మాట్లాడాలి." అన్నాడు కారెక్కుతూ.

అప్పటికే తూరుపు దిక్కున తెలతెలవారసాగింది.

5

రెండు రోజులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరక్కుండా గడిచిపోయాయి.

మూడో రోజు మధ్యాహ్నం లంచ్ సమయంలో అందరూ డైనింగ్ హాల్లో కూర్చున్నాక, సంజయ్ లేచి, "ఫ్రెండ్స్! ఈరోజు మిస్టర్ కుచేలరావు ముందు మిమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని జేసే కొన్ని నిజాలు బైటపెట్టదలచాను. ఆయన్ను పిల్చుకురమ్మని వెంగపదాన్ని పంపించాను. అంతవరకూ ఓపిగ్గా కూర్చోగలరు" అన్నాడు.

సంజయ్ ధోరణి అందర్నీ విస్మయపరచినా, ఏం జరుగుతుందో చూద్దామని కిమ్మనకుండా కూర్చున్నారంతా. పది నిమిషాల తరవాత కుచేలరావుని నడిపించుకుంటూ వచ్చి, కుర్చీలో కూర్చోబెట్టాడు వెంగపదం!

"మిస్టర్ సంజయ్! నాతో ఏదో ముఖ్య విషయం మాట్లాడాలన్నారట. ఏమిటది?" అడిగాడు కుచేలరావు కుతూహలంగా.

"ఔను. ఈరోజు మీ అతిథులముందు నేనొక పచ్చి నిజాన్ని బైటపెట్టదలచాను."

"ఏమిటది?"

"మీరీ ప్రపంచంలోకల్లా ఆరితేరిన అబద్ధాలకోరని!" సంజయ్ నోటివెంట వెలువడ్డ ఆ మాటలు అక్కడ కూర్చున్న వాళ్ళందర్నీ స్థాణువుల్ని జేశాయి.

పచేలరావు ఆ షాక్‌లోంచి తేరుకుని, "నేనా? అబద్దాలకోరునా?" అన్నాడు నోరు తెరుస్తూ.

"ఔను. ఋజువులతోసహా చెబుతాను వినండి. షీల తండ్రి ఒకప్పుడు గొప్ప డాక్టర్ అనీ, మిగతా డాక్టర్లు నయం జెయ్యలేక ఆశవదులుకున్న మీ జబ్బును రూపు మాపి మీ ప్రాణాలు కాపాడారనీ చెప్పారు కదూ?

నిజానికి, ఆయన డాక్టర్ కాదు. మీ ప్రాణాలు కాపాడలేదు. ప్రాణాలు తియ్యడానికి కుట్రపన్ని విష పూరితమైన మందులిచ్చి మిమ్మల్ని చంపడానికి ప్రయత్నించేడు. దైవవశాత్తూ మీరా గండంనించి గట్టెక్కి కోర్టులో ఆయనమీద కేసుపెట్టారు. సాక్ష్యాలు సరిపడక, ఆ కేసు నిలువలేదు. ఆయన మిమ్మల్ని ఎందుకు చంపడానికి ప్రయత్నించాడో కారణం మీకే తెలియాలి.

మిస్టర్ నారాయణవర్మ తండ్రీ, మీరూ యూనివర్సిటీలో చదువుకుంటున్నప్పుడు, మీ శత్రువైన ఒక విద్యార్థి గుండాలతో మీమీద దాడిజేసి, చంపడానికి ప్రయత్నిస్తే ఆయన తండ్రి వాళ్ళను చితకదన్ని మిమ్మల్ని కాపాడారని చెప్పారు.

నిజానికి మీమీద గుండాలతో దాడిజేసింది వేరే ఎవ్వరో కాదు. నారాయణవర్మ నాన్నే! ఆ దాడిలో మిమ్మల్ని మూర్ఛపోయేట్టు కొట్టి, చనిపోయారనుకుని

రోడ్డుమీద వదిలేసి పారిపోయారు వాళ్ళు. దారిన పోయే దానయ్యలద్వారా మీరు హాస్పిటల్ జేర్చబడ్డారు.

తరవాత మీరు వాళ్ళమీద కేసుపెడితే, అందరికీ ఆరారు నెలలు శిక్ష పడింది. ఆయన మిమ్మల్నలా ఎందుకు చావగొట్టించాడో నాకు తెలియదు. ఇక హరనాథ్ తల్లి విషయం! ఆవిడా, మీరూ ఒకే కాలేజీలో చదువుకున్న మాట నిజమే!

అలాగే, జబ్బుతో శానిటోరియంలో చేరిన మీకు అక్కడ నర్సుగా పనిజేసిన డాక్టర్ ఆనంద్ తల్లి ఎంతో శ్రద్ధాసక్తులతో సేవలుజేసిన మాటకూడా వాస్తవమే! ఐతే, మీరా శానిటోరియం నించి డిశ్చార్జయ్యాక, కొద్ది రోజులకు ఆవిడ మీ ఇంటికివచ్చి, మీతో తీవ్రంగా ఘర్షణపడి, నానా బూతులూతిట్టి వెళ్ళిపోయింది. హఠాత్తుగా ఆవిడలా దేనికి ప్రవర్తించిందో విచిత్రమే.

పోతే, కార్తీక తండ్రి గురించి_ ఆయన ఆ రోజుల్లో పోలీస్ ఇన్స్పెక్టర్ గా పనిజేసేవారనీ, ఏదో హత్య కేసులో ఇరుక్కున్న మిమ్మల్ని చాకచక్యంతో కాపాడారనీ చెప్పారు. నిజానికి ఆ హత్యకేసులో మిమ్మల్ని ఇరికించింది ఎవ్వరోకాదు, ఆయనే!

కొమ్ములు తిరిగిన లాయర్లనుపెట్టి, మీరా కేసులోంచి తప్పించుకోగలిగేరు. ఇక్కడ అత్యంత విచిత్ర విషయం ఏమిటంటే, అంతకుముందు ఆయనా, మీరూ ప్రాణమిత్రులు. అటువంటప్పుడు ఆయన మిమ్మల్ని హత్య కేసులో ఇరికించి, ఎందుకు ఊరికంబం ఎక్కించదలచాడో ఎవరికీ అంతుబట్టలేదు!

అటువంటి మీ ఆగర్భ శత్రువుల సంతానమైన వీళ్ళందర్నీ మీరు ఏ ఉద్దేశంతో యిక్కడికి పిలిపించారో

అంతకన్నా అగమ్యగోచరం!'' అని చుట్టూ కూర్చున్న అతిథులవైపు చూశాడు సంజయ్.

అందరూ అతన్ని నమిలి మింగేసేలా చూస్తున్నారు, ఒక్క షీలా తప్ప!

లోలోపల నవ్వుకున్నాడు సంజయ్. ఇంతవరకూ తాము కుచేలరావు ప్రాణదాతల సంతానమనీ, దాని ప్రతిఫలంగా ఆయన ఆస్తికి వారసులం కాబోతున్నామనీ మురిసిపోతున్నవాళ్ళు, ఇప్పుడు హఠాత్తుగా తామాయన శత్రువుల సంతానమని తెలియగానే, కలిసి రాబోతున్న ఆ కలిమి యెక్కడ తొలగిపోతుందోనని బెదిరిపోతున్నారు.

ఆ నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ ఖంగుమంది కుచేలరావు కంఠం. ''మిస్టర్ సంజయ్! నీ గురించి నేనేమో అనుకున్నాను. ముత్తానికి కాకులుదీరిన పిండాని వేనన్నమాట. ఈ విషయ సేకరణకు నీవు ఎంతో మందీమార్బలాన్ని వినియోగించి ఉంటావ్! ఔనా?''

''ఆ విషయం తరవాత! ముందు నే చెప్పిందంతా నిజమేనని మీరంగీకరిస్తున్నారా?''

''నా అంగీకార, అనంగీకారాలతో మీకు నిమిత్తం లేదు. ఒకవేళ వీళ్ళంతా నా శత్రువుల సంతానమే అనుకున్నా, యెంతో వ్యయప్రయాసలకోర్చి, వీళ్ళను పిలిపించి, నా ఆస్తికి భాగస్వాములను చెయ్యడం గొప్ప విషయమే కదా?

ఇక యింతకి మించి నేనేమీ మాట్లాడదలచుకోలేదు. వెంగపదం! నన్ను తీసికెళ్ళు'' అన్నాడు కుచేలరావు లేస్తూ.

అతిథులంతా తలమీది భారం తొలగిపోయినట్టు నిట్టూర్చారు తేలిగ్గా.

"కుచేలరావుగారూ! దయచేసి కూర్చోండి. నేనింకా అసలు విషయానికి రాలేదు. నేను బైటపెట్టదలచుకున్న మరో కొత్త సమాచారాన్ని విన్నాక ఈ అతిధులంతా దిగ్భ్రాంతితో స్తబ్ధులవుతారో, మరేమవుతారో నని భయంగా ఉంది—" అన్నాడు, సంజయ్ నాటకీయంగా.

"ఏమిటది?" అన్నాడు కుచేలరావు అప్రయత్నంగా కుర్చీలో చతికిలబడుతూ.

"మీరిప్పుడు అరవై లక్షలకు అధిపతి అనీ, మీ తదనంతరం ఆ డబ్బంతా వీళ్ళకు చెందేలా విల్లు రాస్తాననీ బొంకారు కదూ?"

"బొంకడమా? ఏమిటీ పిచ్చి వాగుడు? అది నా దృఢ నిర్ణయం" అన్నాడు కుచేలరావు తీక్షణంగా.

పకపక నవ్వేడు సంజయ్. "ఐతే ఆ డబ్బెక్కడుంది? అంత ధనాన్ని మీరీ లంకంత యింట్లో ఒంటరిగా వుంచరన్నది సుస్పష్టం! అందుకే భారతదేశంలోని బ్యాంకులన్నీ క్షుణ్ణంగా చెక్ చెయ్యబడ్డాయి. ఏ ఒక్క బ్యాంకులోనూ మీ పేర ఖాతా గానీ, లాకర్ గానీ లేవు. మరి మీ అరవై లక్షల అపార సంపత్తి ఎక్కడున్నట్టు?

అంతేకాదు. ప్రస్తుతం మీమీద తలకుమించిన అప్పులున్నాయి. ఆరునెలలుగా కరెంట్ బిల్ కట్టనందుకు మీ ఇంటి ఫ్యూజ్ బోర్డ్ ఊడబెరుక్కుపోయారు. అలాగే టెలిఫోన్ బిల్ చెల్లించనందుకు ఆ లైన్ కూడా కట్ చెయ్యబడింది. అంతకన్నా విచిత్రం ఏమిటంటే పాలవాడికీ, బొగ్గులవాడికీ సైతం మీరు అనేక నెలలనించి డబ్బు చెల్లించడంలేదు. అరవై లక్షల ఆస్తిపరుడికి ఇటువంటి పిల్ల అప్పులా? దీనికి మీ జవాబేమిటి?"

వేదాంతిలా నవ్వేడు కుచేలరావు. "మిస్టర్ సంజయ్! మీ అమోఘమైన తెలివితేటల్ని నేను అభినందించ కుండా ఉండలేకపోతున్నాను. కారణం, దేశంలోని ఏ బ్యాంకులోనూ నాకు ఖాతా లేదన్నమాట నిజం! అలాగే, నామీద చిన్న చిన్న అప్పులు కూడా ఉన్నమాట నిజమే.

అంతమాత్రాన నాదగ్గర అరవైలక్షలు లేకపోవడం సబబు కాదు. నేనా ధనాన్ని మరెక్కడో గుప్తంగా దాచి ఉండవచ్చు కదా? అలాగే నా అప్పుల విషయం, నా తరవాత అవి అణాపైసలతో సహా చెల్లించబడతాయి. నా విల్లులో ఆ ఏర్పాట్లు జేస్తాను. ఆ అప్పులవాళ్ళు ఊరికే నాపైన అన్నిరోజుల బాకీలు వదిలి ఊరుకో లేదు. ధనవంతులపైన తమ బాకీలు ఉండటం వాళ్ళు గర్వకారణంగా భావిస్తారు."

"ఇటువంటి కల్లిబొల్లి కబుర్లతో మీరీ అతిధుల్ని మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నమాట!"

"మీలాగే వీళ్ళు కూడా అలాగే అనుకుంటే, నిక్షేపంగా ఇక్కణ్ణించి వెళ్ళిపోవచ్చు. నేనెవ్వర్నీ అభ్యంతరపెట్టను. దట్సాల్" అంటూ లేచాడు కుచేలరావు.

వెంగపదం ఆయన్ని తోడ్కొని వెళ్ళిపోయాక, అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"మిస్టర్ సంజయ్! పానకంలో పుడకలా మీరు మా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి, కుచేలరావుగారి మన శ్శాంతిని భంగం చేస్తున్నారు. మీరు కేవలం మీ కజిన్‌కు తోడుగా యిక్కడికి వచ్చారని మరిచిపోకండి.

ఒకవేళ ఆ ముసలాయనవద్ద దమ్మిడీ లేకుంటే, మా అందరికీ వందరూపాయలనోట్లూ, వెయ్యి రూపాయల

నోట్లూ ఎలా పంపుతాడు? దివాలాకోరు మనిషయ్యేడైనా అలా ఐదువేల ఐదువందల రూపాయలు వృధా జేస్తాడా? ఆయనదగ్గర డబ్బు ఉంది. ఎక్కడో దాచి ఉంది. ఈ వ్యవహారం తేలేవరకూ నే నిక్కణ్నించి కదలదలచుకో లేదు'' అన్నాడు హరనాథ్ సీరియస్‌గా.

''నేనూ!''

''నేనూ!''

''నేనూ!'' అన్నారందరూ ముక్తకంఠంతో.

6

ఆ మర్నాటి సాయంత్రం ఏడు గంటలకు డాక్టర్ ఆనంద్ సంజయ్ గదికి వచ్చి, ''ఈఇంట్లో సరైన కంపెనీ దొరక్క చాలా బోర్‌గా ఉంది నాకు. బైట వెన్నెల కాస్తోంది. అలా తోటలో తిరిగివద్దామా?'' అడిగాడు.

''ఓ. ష్యూర్! ఉండండి, షీలకూడా వస్తుందేమో కను క్కొస్తాను—'' అంటూ ఆమె గది కెళ్ళి అడిగాడు సంజయ్.

షీల యేదో యింగ్లీష్ నవల చదువుకుంటోంది. ఆతన్ని వెళ్ళమంది. డాక్టర్ ఆనంద్ వెంట యింట్లోంచి బైటికి వచ్చాడు సంజయ్. బైట నిజంగానే పిండారబోసినట్టు కాస్తోంది వెన్నెల. ఆ వెన్నెల్లో తోటలో ఎన్ని గంటలు గడిపినా తెలిసిరాదు. ఇద్దరూ పచార్లు చేస్తున్నట్టు వెనక తోటలోకి నడిచేరు.

కొద్దిదూరం వెళ్ళారో లేదో, సంజయ్ చటుక్కున డాక్టర్ చెయ్యి నొక్కి ఆపాడు. ఆ హఠాత్సంఘటనకు నివ్వెరబోతూ అతనివైపు చూశాడు ఆనంద్. సంజయ్ మాట్లాడవద్దన్నట్టు సైగజేసి, ఎదురుగా ఉన్న ఓ చెట్టు వైపు సైగజేశాడు.

చటుక్కున అటు చూసి నోరు తెరిచాడు ఆనంద్.

హరనాథ్, కార్తీకా ఈ లోకాన్ని మైమరచి ఒకరి బాహుబంధాల్లో ఒకరు ఇమిడి తన్మయత్వం అనుభవిస్తున్నారక్కడ! హరనాథ్ ఆమె పెదాలనీ, బుగ్గలనీ తన అధరాలతో స్పృశిస్తూ వీపు వెనక బ్లౌజు హుక్స్ ఊడదీస్తున్నాడు.

"ఓహ్ గాడ్! నో!" ఆ దృశ్యం చూళ్ళేక గట్టిగా కళ్ళుమూసుకున్నాడు ఆనంద్.

"ఇందులో చూడకూడనిదేమీ లేదే? స్త్రీ పురుషులిరువురూ రాసక్రీడలు సల్పడం వింతేమీ కాదే? మీకిలాటివి పడవా?" అడిగాడు సంజయ్ నవ్వుతూ.

ఆనంద్ పలకలేదు. కళ్ళు తెరిచి మళ్ళీ అటు చూశాడు. అప్పటికే కార్తీక బ్లౌజు హుక్స్ ఊడదీశాడు హరనాథ్. అంతే!

"నో, నో! ఆగండి...ఆగండి. తొందరపడకండి" అంటూ అటు పరుగుతీశాడు డాక్టర్ ఆనంద్.

అంతవరకూ ఈ లోకంలో లేని జంట పక్కాలో పిడుగులు పడ్డట్టు అదిరిపడి లేచి నిల్చున్నారు. కార్తీక చటుక్కున పైటనిండుగా కప్పుకుని చెట్టుపక్కకి తప్పుకుంది.

భార్యా వియోగుడైన ఆ బ్రహ్మచారి, ఎన్నాళ్ళ తరువాతో లభ్యమైన ఆ సువర్ణావకాశం ఆ విధంగా భగ్నమయ్యేసరికి నిప్పులు కక్కే కళ్ళతో చూశాడు ఆనంద్ వైపు. అతని ఆగ్రహ దృక్కుల్ని తట్టుకోలేక తలవంచుకున్నాడు డాక్టర్.

"అయామ్ వెరీ సారీ మిస్టర్ హరనాథ్! మీరు చేస్తున్నపని అనుచితంగా తోచి,ఆవేశపడ్డాను"అన్నాడు తగ్గు స్వరంతో.

"మీరావేశపడటానికి నేనేమీ రేప్ చెయ్యడంలేదామెను. ఇద్దరం ప్రేమించుకున్నాం. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం! తొందర పడ్డామే అనుకోండి. ఇందులో అనుచితం ఏముంది? ఐనా, మా వ్యక్తిగత విషయాల్లో కలగజేసుకుని కలత జెందడానికి మీరెవ్వరు?" అన్నాడు హరనాథ్ తీక్షణంగా.

"ఐనవాణ్ని గనకే యింతగా ఆరాటపడుతున్నాను" అంటూ యింకా ఏదో చెప్పబోయి, మౌనం వహించాడు ఆనంద్.

హరనాథ్ సాలోచనగా తలూపాడు. "ఇప్పుడర్థమైంది. అందమైన కార్తికను పొందడానకి తపించిపోతున్న నీవు, మేమిలా కనిపించేసరికి ఈర్ష్యాసూయలతో దహించుకుపోతున్నావన్నమాట."

"శివ, శివా!" అంటూ చెవులు మూసుకున్నాడు ఆనంద్.

"లేకుంటే నీ వింతగా బాధపడిపోవడానికి ఏమిటి కారణం? మే మిద్దరం ప్రేమించుకోవడం, నీ కిష్టం లేదా?"

"అపచారం! మహాపచారం!"

అంతవరకూ ప్రేక్షకుడిలా నిల్చుని ఆ ఆర్భాటం చూస్తున్న సంజయ్ కలగజేసుకున్నాడు. "మిస్టర్ ఆనంద్! మీరేదో చెప్పడానికి తటపటాయిస్తున్నారు. దాస్తున్నారు. ఏమిటది? చెప్పండి" అన్నాడు అతన్ని సూటిగా చూస్తూ.

డాక్టర్ ఆనంద్ నోరు విప్పడానికి మళ్ళీ వెనకా ముందూ అయి, ఇక విధిలేదన్నట్టు తలెత్తాడు. "కర్ణ కఠోరమైన ఆ నిజం మీ ముందు ఎలా బైటపెట్టాలో నా

కరంకావడంలేదు. చెబితే విని తట్టుకోగలరా మీరు? చెప్పకపోతే మానవజాతి యావత్తూ సిగ్గుపడేటటువంటి ఘోరం జరిగిపోవచ్చు.

ముందు నా జీవనరహస్యం చెబుతా వినండి. నా తల్లి ఒక శానిటోరియంలో నర్సుగా పనిచేసేదన్న విషయం మీకు తెలుసుకదా?

ఒకప్పుడు కుచేలరావు జబ్బుపడి ఆ శానిటోరియంలో చేరానని చెప్పాడు కదా? అప్పుడు నా తల్లి ఎంతో ఆత్మీయంగా తనకు సేవలుజేసి, కోలుకోడానికి తోడ్పడిందన్నాడు కదా?

అక్కడే అతను నా తల్లితో ప్రేమపురాణం సాగించాడు. పెళ్ళి చేసుకుంటానని బాసలు చేశాడు. ఆమె అతన్ని నమ్మింది. మనసా వాచా ఆరాధించింది. కుచేల రావు ధనవంతుడు గనక స్పెషల్ వార్డులో ధనవంతులకు ప్రత్యేకించే రూంలో ఉండేవాడు. మాయ మాటలతో నా తల్లిని వశంజేసుకుని, అక్కడే ఆమెను...'' చెప్పటానికి నోరు చెల్లక ఆగిపోయాడు ఆనంద్.

క్షణం తరవాత తలెత్తి_''అలా నా తల్లిని కొంత కాలం ఆటబొమ్మలా వాడుకున్నాడక్కడ. శానిటోరియం నించి డిశ్చార్జయి నెలరోజులు గడిచినా అతన్నించి ఎటువంటి రెస్పాన్స్ లేకపోయేసరికి, ఒకరోజు నా తల్లి స్వయంగా అతనింటికెళ్ళి, పెళ్ళి విషయం కదిపింది.

అదివరకు తానామెను యెరగనట్టే మాట్లాడాడుట. అప్పుడు తెలిసిందామెకు అతని నిజరూపం! నా తల్లి ఆ అవమానాన్ని, ఆగ్రహాన్ని భరించలేక అతనితో ఘర్షణ పడి,నానా బూతులూ తిట్టి వచ్చేసింది. ఆ తరవాత ఆమె పెళ్ళి అదే శానిటోరియంలోపనిచేసే ఒక కంపౌండర్‌తో జరిగిపోయింది.

ఆమె చనిపోతూ చివరి ఘడియల్లో నాకు చెప్పిన కథనం ఇది. అందుకు బలీయమైన కారణం లేకపోలేదు. ఏరోజైతే ఆమె కుచేలరావు యింటికెళ్ళి తనని పెళ్ళి చేసుకోమని ప్రాధేయపడిందో, అప్పటికే అతని ప్రతిరూపం ఆమెలో రూపు దాల్చిందట.

పెళ్ళైన తరవాత ఆమె ఓ మగపిల్లాణ్ని కన్నది. ఆ పిల్లాడు ఎవ్వరోకాదు. నేనే!'' డాక్టర్ ఆనంద్ నోటి నించి వెలువడ్డ ఆ వాక్యం ఆ ముగ్గుర్నీ దిగ్భ్రాంతిలో ముంచెత్తింది.

''నేనే కాదు. ఇక్కడికి పిలిపించబడ్డ అతిథులంతా ఆయన అక్రమ సంతానమేనని నా అనుమానం! యవ్వనంలో ఆయన స్త్రీలోలుడై ఉంటాడు. పరిచయమైన ప్రతి ఆడదాన్నీ మాయమాటలతో వశం చేసుకుని, అవసరం తీరాక వంచించి ఉంటాడు. అందుకే ఆ కుటుంబాలతో విరోధం తెచ్చుకున్నాడు. ఈ చివరిదశలో తనకు వారసు లెవ్వరూ మిగల్లేదు గనక, తన అక్రమ సంతానమైన మేము జ్ఞాపకం వచ్చివుంటాం!

కనీసం ఈ విధంగానైనా మాకు మేలు జేసి, తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నాడేమో! ఇప్పుడర్థమైందా హరనాథ్! మీ యిద్దరి విషయంలో నే నెందుకింత ఆరాటపడ్డానో? అజ్ఞానంలో పడి మీరెటువంటి పాపానికి ఒడిగట్టబోయారో? ఒక విధంగా కార్తీక నీకు వరసకు చెల్లెలవుతుంది!'' డాక్టర్ మాటలకు కార్తీక ఒక్కసారి గావుకేకపెట్టి, వెక్కి వెక్కి ఏడుస్తూ అక్కణ్నించి పరుగుతీసింది.

హరనాథ్ మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు!

7

ఆ మర్నాటి ఉదయం అందరూ బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని, హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

రాత్రి జరిగిన సంఘటనతో కార్తీక, వాళ్ళ ఎదుటపడటానికి సిగ్గుపడి తన గదిలోనే గడుపుతోంది. బ్రేక్‌ఫాస్ట్ కూడా పైకే తెప్పించుకుంది.

అంతలో బైట కారాగిన చప్పుడు విని అందరూ ద్వారంవైపు చూశారు.

చేతిలో ఫైళ్ళు పట్టుకొని, ఓ వ్యక్తి లోపలికి వచ్చాడు.

అతన్ని చూడగానే, "లాయర్ శాంతిప్రకాశ్‌గారొచ్చారు" అంటూ గబ గబ కుచేలరావు గదివైపు వెళ్ళాడు వెంగపదం.

అందరి దృష్టి లాయర్‌మీద నిలిచింది. నలభైఏళ్లుంటాయతనికి. చామనచాయ. కణతలదగ్గర నెరసిన జుత్తు. కళ్ళకి అద్దాలు. అతనుకూడా అందరివైపు ఒకసారి దృష్టిసారించి, చిరునవ్వు నవ్వుతూ కుచేలరావు గదిలోకి నడిచాడు.

రెండు నిమిషాల తరవాత వెంగపదం హాల్లోకి వచ్చి, "బాబుగారు అందర్నీ లోపలికి రమ్మంటున్నారు" అన్నాడు.

అంతా లేచి ఆయన గదిలోకెళ్ళారు.

"ఫ్రెండ్స్! నా ఫామిలీ లాయర్ శాంతిప్రకాశని చెప్పానే. ఈయనే! మద్రాసులో ప్రాక్టీస్ చేస్తున్నాడు. నేను చెప్పిన వివరాల ఆధారంగా మీయందరి గురించీ ఆరాతీసింది కూడా ఈయనే!

నా నిర్ణయం ప్రకటించడానికి మిమ్మల్ని పదిహేను

రోజులిక్కడ అగమన్నాను కదా? ఇప్పుడా ఉద్దేశం మార్చుకున్నాను.''

—అని కుచేలరావు చుట్టూ ఓసారి కలయజూసి, "ఇప్పటికే మీరంతా ఇక్కడ వినుగ త్తి ఉంటారు. ఇక నేను మీ ఓర్మిని పరీక్షించదలచుకోలేదు. అందుకే, శాంతి ప్రకాశ్‌తో సంప్రదించి నా ఆ స్తికి వారసుల్ని నిర్ణయించాను'' అన్నాడు.

అందరూ ఊపిరి బిగబట్టి, ఆయన యేం చెబుతాడో వినాలని చెవులు రిక్కించారు.

"నా మరణానంతరం అరవైలక్షలు విలువజేసే నా ఆ స్తిని మీ అందరికీ సమానంగా, అంటే ఒక్కొక్కరికి పది లక్షల చొప్పున పంచుతున్నాను'' కుచేలరావు నోటి నించి వెలువడ్డ ఆ వాక్యాలు అందరి హృదయాలమీదా తేనెజల్లులు కురిపించాయి.

నాగు పాము బుసలు కొట్టినట్టు నిట్టూర్చారు తేలిగా.

"ఐతే, ఇందులో కొన్ని షరతులున్నాయి. నిజానికి నేను పిలవదలచుకున్న వ్యక్తులు ఏడుగురు. అందులో ఒకతను కాలచక్రంలో కలసిపోయాడు. మరొకరి గురించి ఇంకా ఆచూకీ తెలియలేదు. అతని పేరు లక్ష్మీపతి. అతనితో కలిపి వారసుల సంఖ్య ఆరవుతుంది.

నా మరణానంతరం నెలరోజుల్లోగా అతని ఆచూకీ తెలిస్తే మిగతావాళ్ళతోబాటు అతనికీ పదిలక్షలు చెందుతాయి. నెలరోజులు దాటాక, నా ఆస్తితో యెటువంటి సంబంధం వుండదు. అతనికి చెందవలసిన ఆ పదిలక్షలూ మీ ఐదుగురికీ సమానంగా పంచబడతాయి. అంటే, అతను రాని పక్షంలో మీ ఐదుగురికీ అదనంగా మరో చెరి రెండు లక్షలు చెందుతాయన్నమాట.

పోతే, ఈ ఇల్లు వెంగపదం పేర రాస్తున్నాను. కారణం, వాడు పదేళ్ళనించీ రాత్రీ పగలూ అనక నాకు సేవలు చేస్తున్నాడు. వాడి నిస్వార్థ సేవలకు ఋణం తీర్చుకోవడం నా కనీస ధర్మం!"

"మరి మీ అప్పుల సంగతేమిటి?" మధ్యలో అందుకున్నాడు సంజయ్.

కుచేలరావు నవ్వి- "చెరి పన్నెండులక్షలు పుచ్చుకునే ఈ ఐదుగురు వారసులు నా కొద్దిపాటి అప్పులు కూడా తీర్చలేరా? ఆల్ రైట్! లాయర్ శాంతిప్రకాశ్ ఈ ఇంట్లోని సామానంతా అమ్మేసి ఆ అప్పులు తీర్చేస్తాడు లెండి. మీ కెందుకు శ్రమ" అంటూ అతనివైపు తిరిగి, "వీలునామా సిద్ధం చేశావా?" అడిగాడు.

శాంతిప్రకాశ్ తలూపి, ఫైల్లోంచి అరఠావు సైజు కాగితాలు తీశాడు. "వీళ్ళందరి సమక్షంలో సంతకం చేస్తానిలా ఇవ్వు. సాక్ష్యుల స్థానంలో సంజయ్, సత్యవతీ సంతకాలు చేస్తారు. వీరికి ఆస్తితో ఎటువంటి సంబంధం లేదుకదా!" అన్నాడు కుచేలరావు చెయ్యి జాపుతూ.

శాంతిప్రకాశ్ వీలునామాను ఫైలు మీదుంచి, పెన్ను ఆయన కందించాడు.

ఆయన సంతకం పూర్తయ్యాక, సాక్ష్యులస్థానంలో సంజయ్, సత్యవతీ సంతకాలు పెట్టారు.

"వీలునామా ఎలాగూ రాసేశారు కదా? ఇక అరవై లక్షల ధనరాశిని ఎక్కడ దాచిపెట్టారో కూడా చెప్పేస్తే బావుంటుందని నా అభిప్రాయం!" అన్నాడు సంజయ్ కుతూహలం ఆపుకోలేక.

కుచేలరావు నవ్వి— "సమయం వచ్చినప్పుడు అది కూడా తెలుస్తుంది లెండి. ఆ రహస్యాన్ని నే నిప్పు

దప్పుడే బైటపెట్టదలచుకోలేదు. అది నాకు తప్ప మరెవ్వరికీ తెలీదు. లాయర్ శాంతిప్రకాశ్ కూడా!

ఇక వీలునామా తయారయింది కనక, మీరంతా వెళ్ళిపోదలచుకుంటే వెళ్ళడానికి నాకేం అభ్యంతరం లేదు. ఉండాలనుకున్నా ఆక్షేపణలేదు. ఎందుకైనా మంచిది. మరో పదిరోజులాగి చూడండి. నేను శాస్త మూడిప్పని. ఆ నిధి రహస్యం మీతో చెప్పాలని నాకు ఏక్షణంలోనైనా తట్టవచ్చు..." అంటూ లేచాడు.

శాంతిప్రకాశ్, వెంకపదం ఆయన్ని నడిపించుకుంటూ లోపలికి తీసికెళ్ళారు.

అతిథులందరి కళ్ళల్లోనూ తృప్తీ, ఆనందం వెల్లివిరుస్తున్నాయి.

లేచి ఎవ్వరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం అలా ఇంటిబైట పచార్లుజేసి వద్దామని గదిలోంచి బైటికివచ్చిన సంజయ్‌కు ఎన్నడూ లేనిది వెంకపదం ఈరోజు టిప్‌టాప్ గా తయారయి ఎక్కడికో వెళుతూ ఎదురయ్యాడు.

"పెళ్ళికొడుకులా తయారయ్యావు! ఎక్కడికీ ప్రయాణం?" అడిగాడు సంజయ్.

వెంకపదం నవ్వి- "అయ్యగారు వారానికొక్కసారి నాకు సెలవిస్తారు. ఆదివారమంతా వంగతూర్‌లో గడిపి వస్తుంటాను. ఈరోజు శనివారం గదా? వెళ్ళిపోతున్నాను. రేపు సాయంత్రానికల్లా వచ్చేస్తాను. అంత వరకూ మీ అవసరాలన్నీ ముసలి తోటమాలి చూసుకుంటాడు. వస్తాను" అంటూ ముందుకు సాగిపోయాడు.

ఆ ఇంట్లో వెంకపదంగాక, తోటమాలీ, వంటమనిషీ పనిజేస్తున్నారు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు గనక తోట చివర గుడిసెలో ఉంటారు.

ఆ రాత్రి భోజనాలయ్యాక, షీల సంజయ్ గదిలోకి వచ్చి- "కుచేలరావు వీలునామా రాసేశాడు కదా? ఇంకా మనమిక్కడుండి ఏం చెయ్యాలి? నాకు చచ్చే బోర్‌గా ఉంది. మద్రాసు వెళ్ళిపోదాం!" అంది.

సంజయ్ కాసేపు ఆలోచించి, "ఆల్ రైట్! రేపొక్కరోజుండి, వెళ్ళిపోదాం! నాకు నిదర ముంచు కొస్తోంది. వెళ్ళిపడుకో" అన్నాడు.

షీల వెళ్ళగానే గది తలుపుమూసి, లైటార్పి పక్కమీద వాలాడు సంజయ్.

8

అర్ధరాత్రి ఆ నిశ్శబ్ద నిశీధిని చీల్చుకుంటూ గుండెలదిరేలా గావుకేక వినిపించి, సంజయ్ త్రుళ్ళిపడి లేచాడు. ఎక్కడో, ఎవ్వరో సన్నగా మూలుగుతున్న సవ్వడి.

దిండుకిందినించి టార్చితీసి, ఒక్క వుదుటున మంచం దిగి, తలుపువైపు ఉరికాడు. నడవాలో అడుగుపెట్టి చుట్టూ కలయజూశాడు.

అప్పటికే ఒక్కో గది తలుపు తెరుచుకుని ఖంగారుగా బైటికి వస్తున్నారు మిగితావాళ్ళు.

"ఏమిటా గావుకేక?"

"ఎక్కణ్నించి వచ్చింది?"

"పదండి. కిందికెళ్ళి చూద్దాం!" అంటూ మెట్లవైపు పరుగు తీశాడు సంజయ్. కుచేలరావు గదిముందు తలుపు దగ్గర మంచముంది. ఆ మంచంమీద బోర్లా పడుందో ఆకారం! పరుపంతా రక్తసిక్తం!! టార్చి వెలుగు ఆ ఆకారంమీద వేసి ఉలిక్కిపడ్డాడు సంజయ్.

అతను శాంతిప్రకాశ్! లాయర్ శాంతిప్రకాశ్!! అతని వీపులో కత్తి!!! సడన్‌గా కుచేలరావు జ్ఞాపకం

వచ్చి, ఆయన గదిలోకి పరుగుతీశాడు సంజయ్.

అక్కడ కనిపించిన దృశ్యం అతన్ని రాతిబొమ్మను చేసింది. మంచంమీద వెల్లకిలా పడున్నాడు పచేల రావు. కళ్ళు రెండూ తెరిచి ఉన్నాయి. నాలిక బైటికి వచ్చి ఉంది. కంఠం చుట్టూ పొడవాటి చేతిరుమాలు గట్టిగా బిగదీసి ఉంది!

“ఠంగ్!” మన్న శబ్దంతో త్రుళ్ళిపడ్డాడు సంజయ్.

గోడ గడియారం కొట్టిన ఒంటిగంట అది!

అంతలో మిగతా వాళ్ళుకూడా వచ్చారు లోపలికి.

“గుడ్ న్యూస్ మిస్టర్ సంజయ్! లాయర్ శాంతి ప్రకాశ్ చావలేదు. కొన ఊపిరితో ఉన్నాడు. కత్తి మీది వేలిముద్రలు చెరక్కుండా లాగేసి, గాయానికి కట్టుకట్టి ఇంజక్షన్ ఇచ్చాను” అన్నాడు డాక్టర్ ఆనంద్.

“థాంక్ గాడ్! అతను కోలుకున్నాక, హంతకుడి ఆనవాళ్ళైనా చెప్పగలదేమో కనుక్కోవాలి. హరనాథ్! మీరు నా కార్లో వంగత్తూర్ వెళ్ళి, వెంటనే పోలీసుల్ని పిల్చుకురండి” అంటూ కారు తాళం చెవులు తీసి అతని కందించాడు సంజయ్.

అందరి ముఖాల్లోనూ భయం, ఆరాటం నాట్యం చేస్తున్నాయి.

సంజయ్ ఒక్కొక్కర్నీ పరీక్షగాచూసి, “మనం ఇక్కడికి వచ్చిన తొలిరోజుకూడా పచేలరావుని చంపడానికి ప్రయత్నం జరిగింది. హంతకుడి దురదృష్టవశాత్తు ఆయన చావలేదు. ఐతే, ఆ హత్య ప్రయత్నానికీ, ఈ హత్యకూ పరిస్థితుల దృష్ట్యా చాలా తేడా ఉంది.

అప్పుడు కుచేలరావింకా, వీలునామా రాయలేదు. ఆస్తికి ఎవర్ని వారసులుగా నిర్ణయిస్తారో కూడా తెలీదు. దీన్నిబట్టి, ఆ హత్యా ప్రయత్నం ఆస్తికోసం జరగలేదనీ, కేవలం పగా, ద్వేషం, కక్షల కారణంగానే జరిగి ఉంటుందనీ అనుకోవచ్చు.

ఈ హత్య అలా కాకుండా, ఆస్తిని త్వరగా కాజేద్దామనే ఉద్దేశంతో జరిగి ఉంటుందని నా అభిప్రాయం! ఐతే, ఇక్కడ మళ్ళీ ఓ ధర్మసందేహం తలెత్తుతుంది.

కుచేలరావు తన సంపత్తిని ఎక్కడ దాచాడో ఇంకా చెప్పలేదు. ఆ రహస్యం తనకి తప్ప మరెవ్వరికీ తెలీదన్నాడు. దాని గురించి తెలియనప్పుడు హంతకుడు ఏ ఉద్దేశంతో ఈ హత్య చేసినట్టు?

దీనికి జవాబు ఆ రహస్యం గురించి హంతకుడికి తెలిసిందేమోనని? లేదా, ఆ నిధి ఎక్కడ దాచబడిందో తనకు తాను పరిశోధించి కనిపెట్టి ఉండాలి. అతని ఆస్తికి వారసులైన ఐదుగురూ హత్యా సమయంలో ఇక్కడే ఉన్నారు గనక, మీరంతా అనుమానితులే అవుతారు.

లాయర్ శాంతిప్రకాశ్‌ను పొడిచిన కత్తితోనే, హంతకుడు కుచేలరావుని చంపటానికి వచ్చుంటాడు. చీకట్లో పొరపాటున హంతకుడి కాలు గదిముందు పడుకున్న శాంతిప్రకాశ్ మంచానికి తగిలి ఉంటుంది. ఆ కుదుపుకు అతను లేచి ఉంటాడు. దాంతో హంతకుడు ఖంగారుపడి ఆ కత్తితోనే అతన్ని పొడిచి వుంటాడు. తరవాత గదిలోకి దూరి, చేతి రుమాలుతో కుచేలరావు కుత్తిక బిగదీసి చంపి ఉంటాడు...'' సంజయ్ మాట ఇంకా పూర్తికాలేదు.

అంతలో, హరనాథ్ వెంట హడావుడిగా ఇంట్లోకి ప్రవేశించారు పోలీసులు.

ప్రాథమిక పరిశీలన పూర్తయ్యాక, చిన్నగా నవ్వాడు ఇన్‌స్పెక్టర్. "ఆనాడు తనకు పోలీసుల సహాయం అక్కర్లేదని డాంబికాలు పలికాడే ముసలాడు? ఇప్పుడేమయింది? ఆరోజే మా సహాయం కోరిఉంటే, ఈనాడీ అనర్థం జరిగేదా? ఎవరి ఖర్మకెవరేం జేస్తారండి!"అంటూ అందర్నీ ఓమారు కలయజూసి–

"కేసు ముగిసేవరకూ మీరంతా ప్రస్తుతం అనుమానితుల కిందే జమకట్టబడతారు. అందర్నీ విడివిడిగా ప్రశ్నించక తప్పదు. రాత్రి పన్నెండూ ఒంటిగంట మధ్య మీరెక్కడున్నారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ నారాయణ వర్మని చూస్తూ.

"నా గదిలోనే ఉన్నాను!"

"అబద్ధం! వీళ్ళగది నా గది పక్కనే ఉంది. రాత్రి పన్నెండు గంటలవరకూ ఈ భార్యాభర్తలిద్దరూ ఏ విషయంమీదో చాలాసేపు వాదించుకున్నారు. తరవాత తలుపు తెరిచిన శబ్దం వినిపించింది..." అన్నాడు డాక్టర్ ఆనంద్ మధ్యలో.

ఇన్‌స్పెక్టర్ తీక్షణంగా చూశాడు నారాయణ వర్మను. "దీనికి మీ జవాబేమిటి?"

"న్...నిజమే! నా భార్య చీటికీ మాటికీ నాతో ఘర్షణ పడుతూంటుంది. వీలునామా తయారయింది గనక ఇహ ఇక్కణ్నించి వెళ్ళిపోదామని నేనూ, ఇంకొన్నాళ్ళుందామని ఆమే వాదించుకున్నాం! నాకు విసుగొత్తి, వెన్నెల్లో కాస్త పచార్లుజేసి వద్దామని బైటికెళ్ళాను."

"తిరిగి ఎప్పుడొచ్చారు?"

"పన్నెండున్నరయుంటుంది. అప్పుడు నేనింకా మేల్కొనే ఉన్నాను" అంది సత్యవతి.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపి, మిగతావాళ్ళను కూడా ప్రశ్నలు వేసి, సమాధానాలు నోట్ చేసుకుని, "ఆల్‌రైట్! నా అనుమతి లేనిదే మీలో ఎవ్వరూ ఇక్కణ్ణుంచి కదలకూడదు" అన్నాడు హెచ్చరిస్తూ.

"వీళ్ళతోపాటు మరో వ్యక్తిని మరిచిపోతున్నారు ఇన్‌స్పెక్టర్" అన్నాడు సంజయ్.

ఇన్‌స్పెక్టర్ కనుబొమలు ముడిబడ్డాయి, "ఎవ్వరు?"

"వెంగపదం!"

"ఎక్కడున్నాడు వాడు?"

"ఒకరోజు సెలవుమీద వంగత్తూర్ వెళ్ళాడు!"

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపి, "వాడి సంగతి తరువాత చూస్తాను" అంటూ శాంతిప్రకాశ్‌ను పొడిచిన కత్తినీ, కుచేలరావు శవాన్నీ సిబ్బంది ద్వారా అంబులెన్స్‌లో జేర్చి తీసికెళ్ళాడు.

అతిథుల కళ్ళలోంచి నిదర ఎప్పుడో మటుమాయమైంది. వేకువజామువరకూ అలాగే కూర్చుని తమలో తాము తర్జనభర్జన పడసాగారు. ఉదయం ఎనిమిది గంటలకు స్పృహలోకి వచ్చాడు శాంతిప్రకాశ్. అందరూ అతనిచుట్టూ మూగారు. సంజయ్ ఊహే నిజమైంది!

చీకట్లో ఎవ్వరో మంచానికి తగిలినట్టయి, అతని నిద్ర మేల్కొందిట. బోర్లాపడుకున్నవాడల్లా ఉలిక్కిపడి లేవబోయాడట. అప్పుడు దిగబడిందట పదునైన వస్తువు వీపులో. గావుకేక పెట్టి అలాగే ఒరిగిపోయాడట.

చీకటిపడే వేళకి యిల్లుజేరాడు వెంగపదం!

కుచేలరావు హత్యా వార్తను విని కొయ్యబారి పోయాడు.

"రాత్రంతా నువ్వెక్కడున్నావ్?" అడిగాడు సంజయ్ అతన్ని.

జవాబివ్వడానికి తటపటాయించాడు వెంగపదం.

"పలకవేం?" గద్దించాడు సంజయ్.

వెంగపదం తల వంచుకుని, "చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదుగానీ, విని మీరు నన్ను సహ్యించుకోవచ్చు. ఇక్కణ్నించి వెళ్ళగానే, సారాకొట్లో ఓ సుక్కేసుకుని సానికొంపలో తొంగున్నాను. పెళ్ళీ పెటాకులూ లేని వాణ్ని. తప్పా? కావాలంటే దాన్నడిగి తెలుసుకోండి" అన్నాడు.

"డబ్బుకోసం ఒళ్ళమ్ముకు బ్రతికే ఆడదాని సాక్ష్యం నిజమేనని ఏమిటి నమ్మకం? సరే కుచేలరావెలాగూ ఇప్పుడీ లోకంలో లేడుగనుక ప్రస్తుతం శాంతిప్రకాశ్ బాగోగులు చూడటం నీ డ్యూటీ" అన్నాడు సంజయ్ మేడ మెట్లెక్కుతూ.

9

శాంతిప్రకాశ్ కోలుకోవడానికి రెండు రోజులు పట్టింది.

ఆ రోజతను అందర్నీ సమావేశపర్చి—"ఆనాడు కుచేలరావు నాచేత రాయించిన వీలునామా మీ అందరికీ చదివి వినిపించదలచాను" అంటూ బ్రీఫ్‌కేస్ తెరిచి వీలునామా తీశాడు.

అందులో ఏముందో దాదాపు అందరికీ తెలిసిందే! తెలియనిదల్లా ఆ డబ్బు యెక్కడున్నదని? బహుశా, వీలునామాలో దాని ప్రస్తావనుందేమో వినాలని అందరి చెవులూ నిక్కబొడుచుకున్నాయి.

శాంతిప్రకాశ్ బిగ్గరగా చదివి వినిపించాడు వీలునామా!__

రెండురోజుల క్రితం కుచేలరావు చెప్పినవే ఉన్నాయందులో. డబ్బు ప్రస్తావన ఎక్కడా లేదు!

“అంతా బాగానే ఉందిగానీ, డబ్బు ఎక్కడుందో తెలియనప్పుడు ఈ వీలునామావల్ల ఏమిటి ప్రయోజనం?” అన్నాడు సంజయ్ మొహం చిట్లిస్తూ.

శాంతిప్రకాశ్ పెదవి విరిచి_“ఆ హంతకుడెవ్వరో గానీ, చాలా తొందరపడ్డాడు. కనీసం ఆయన డబ్బు రహస్యం చెప్పేవరకైనా ఆగివుంటే, మనకీ ఉత్కంఠ వుండేదికాదు. ఆయన మరణంవల్ల మీతోపాటు నేనూ నష్టపోయాను.

కుచేలరావు తన పనులు చేసిపెట్టడానికి నాతో ఓ కంట్రాక్టు కుదుర్చుకున్నాడు. ఆయన అకాల మరణంతో నా కంట్రాక్టు మూల్యంకూడా మునిగిపోయింది. ఇప్పుడు నా ప్రతిఫలాన్ని యెవ్వరిదగ్గర తీసుకోను? అంతేగాక, ఆయన అప్పులు తీర్చే భారంకూడా నా నెత్తిన వుంది” అన్నాడు విచారంగా.

“అప్పులన్నీ కలిపి ఎంతుంటాయి?”

“దాదాపు ఇరవై వేలు!”

“ఆ మాత్రం యింట్లో సామానమ్మి తీర్చవచ్చు లెండి__”

“మనకా సామానుతోనూ, అప్పులతోనూ నిమిత్తం లేదు. అవతల పనులన్నీ మూల పడేసి, ఎన్నో మైళ్ళ దూరంనించి వచ్చిపడ్డామిక్కడ. ఆ ముసలాడా డబ్బెక్కడ దాచాడో తెలీదు. ఇన్ని అవస్థలూపడి, వట్టి చేతులతో వెనక్కి వెళ్ళడానికి నేనొప్పుకోను. ముందా

డబ్బెక్కడుందో కనుక్కోవాలి మనం!'' అంది నారాయణవర్మ భార్య సత్యవతి నిక్కచ్చిగా.

అంతా ఆమెను వంతపాడారు!

సంజయ్ సాలోచనగా తలూపి, "ఔను! ఈ భవనం అతి పురాతనమైనది. పాతకాల కట్టడాల్లో ముందు జాగ్రత్తకోసం అనేక రహస్య ప్రదేశాలూ, సొరంగ మార్గాలూ నిర్మించబడేవి. బహుశా, ఈ ఇంట్లోనూ అటువంటివేవో ఉన్నాయేమో? ప్రయత్నిద్దాం!'' అన్నాడు.

ఆ రోజు మొదలు రెండు రోజులవరకూ అందరూ నిద్రాహారాలు మాని, ఆ ఇంటిని పెళ్ళగించినట్టు అంగుళం వదలకుండా గాలించడం ప్రారంభించారు. గోడలనూ, నేలనూ దాటించి, అక్కడ రహస్య అరలేవైనా ఉన్నాయేమో కనుక్కోడానికి శతవిధాలా ప్రయత్నించసాగారు.

చిట్టచివరికి వాళ్ళ ప్రయత్నం ఫలించింది. స్టోర్ రూం నేలలో ఓ రహస్య గృహం ఉన్నట్టు కనుగొన్నారు. అది కనిపించకుండా పైన వెడల్పాటి బండ పరిచి ఉంది. గునపంతో ఆ బండ ఎత్తిచూస్తే, మెట్లు కనిపించాయి.

అందరూ తలో టార్చి అందుకుని, మెట్లగుండా లోపలికి దిగారు. ఒకే ఒక గదికట్టి ఉందక్కడ. అందులో పనికిరాని సామానంతా నింపిఉంది. ఒక్కొక్క సామాను వెలికి తీస్తూ జాగ్రత్తగా పరిశీలించారు.

వాళ్ళకు కావలసినదేమీ లేదక్కడ!

"నేలలో పాతేసి ఉందేమో?'' సందేహం వెలిబుచ్చింది సత్యవతి చమట్లు కక్కుతూ.

"ఎందుకైనా మంచిది. తవ్విచూస్తే సరి!'' అన్నాడామె భర్త.

సాధ్యమైనంత త్వరగా యీ యింట్లోని సామాను వేలం వేసి వాళ్ళ పీడ విరగడ జేసుకోవాలని నిశ్చయించాను. ఈ రోజే ఊళ్ళో దండోరా వేయిస్తాను, రేపిక్కడ వేలంపాట సాగుతుందని. న్యూస్ పేపర్లోనూ ప్రకటన వేయిస్తాను. పేటం ప్రముఖ్యులకో పోలీసుల్ని కూడా పిలిపించడం మంచిది'' అన్నాడు.

అందరూ బుర్రలూపారు మౌనంగా.

రెండవరోజు ఉదయమే ఆ వేలంలో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో రాసాగారు జనం. వంగత్తూర్ నించి పోలీస్ ఇన్స్పెక్టర్ కూడా వచ్చాడు. నలుగురు కానిస్టేబుళ్ళతో, పది గంటల ప్రాంతంలో ప్రారంభమైంది పాట!

వేలం పాటతను ఓ ఇత్తడి పూసజ్జ ఎత్తి, ''ముందు దీనితో ప్రారంభిస్తాను. పాట మొదలుపెట్టండి!'' అన్నాడు.

''నాలుగు రూపాయలు.''

''ఐదు.''

''ఆరు.''

పది రూపాయలవరకూ వచ్చి ఆగిపోయింది పాట.

వేలం వాడు ఒకటీ, రెండూ, మూడూ అనేంతలో, పొట్టిగా, నరచగా ఉన్న ఓ వ్యక్తి పాట పన్నెండు రూపాయలకు పెంచాడు. పూలసజ్జ అతని పరమైంది.

రెండు గంటల్లోపల అటువంటివే పదిహేను చిన్న చిన్న వస్తువులు వేలం వెయ్యబడ్డాయి. అందులో పూల సజ్జలూ, ఇత్తడి బొమ్మలూ, గంటలూ, కుర్చీలూ కూడా ఉన్నాయి. అన్నీ ఆ పొట్టివ్యక్తే స్వంతం జేసుకున్నాడు.

అందరూ అష్టకష్టాలూపడి, అక్కడి సామానంతా పైన స్టోర్ రూంలోకిచేర్చి, నేల తవ్వడం ప్రారంభిం చారు, వంతులవారీగా. నేలతోబాటు వాళ్ళ ఒళ్ళు గుల్ల యిందిగానీ దుర్భిణీపెట్టి వెదికినా నిధి మాత్రం కాన రాలేదు.

నిరాశా, నిస్పృహలతో అందరి గుండెలూ కుంచిం చుకు పోయాయి!

"డబ్బు ఇక్కడే ఎక్కడో దాచిఉంది. ఇందులో సందేహంలేదు. దురదృష్టవశాత్తూ అది మన కంటికి కని పించడంలేదు. ఇల్లంతే క్షుణ్ణంగా గాలించాం! ఇంకా తోట మిగిలి ఉందని మర్చిపోవద్దు. కుచేలరావు తోట లోనే ఏదో ఒక నిర్ణీత ప్రదేశం ఎన్నుకుని డబ్బు దాచి ఉండవచ్చు కదా?" అన్నాడు హరనాథ్.

"ఓరి దేవుడోయ్! ఇహ నావల్లకాదు. ఆ డబ్బు సంగతి దేవుడెరుగు. రెండ్రోజుల్నించీ తిండీ, నిద్రాలేక దుక్కలాటిదాన్ని కాస్తా మామిడి పిక్కలా తయా రయ్యాను. ఆ ఇన్‌స్పెక్టర్ ఎప్పుడు పొమ్మంటాడోగానీ, ఇహ ఒక్క క్షణంకూడా ఇక్కడుండను ఈశ్వరోయ్!" అంది సత్యవతి ఆయాసపడుతూ.

10

మర్నాడు ఉదయం లాయర్ శాంతిప్రకాశ్ అందర్నీ హాల్లో సమావేశపర్చి, "డబ్బుకోసం మనం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అవతల అప్పులవాళ్ళు నా ప్రాణం తీస్తున్నారు. ఇంకొన్నాళ్ళిలాగే దాటవేస్తే ఓరోజు నా కాళ్లూ, కీళ్ళూ ఊడలాక్కుపోయేట్టు న్నారు.

అతని టెక్నిక్ ఏమిటంటే వేలంవాడు ఒకటీ రెండూ, మూడూ అనేంతలో పాటపెంచి, వస్తువు కైవసం చేసు కుంటాడు.

వేలంవాడు పదహారవ వస్తువు పాటకు పెట్టబోయేం తలో ఓ చెవర్లెట్ కారువచ్చి ఆగిందక్కడ.

అందులోంచి ఓ నలభైఏళ్ళ వ్యక్తి దిగి, "ఆపండి ఈ వేలాన్ని!" అన్నాడు దాదాపు అరుస్తూ.

అందరూ దిగ్భ్రాంతితో అతనివైపు చూశారు.

"ఎందుకు ఆపాలి? ఎవరు మీరు?" అడిగాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

"నేను బిల్డింగ్స్ కంట్రాక్టర్ని! నా పేరు శివసుందరం! కుచేలరావుగారు రెండేళ్ళ క్రితం ఈ బిల్డింగ్ మరమ్మ త్తుల పని నా కప్పగించారు. పని పూర్తయ్యాక, నా పైకం పూర్తిగా చెల్లించలేదు. ఇంకా ఐదువేలు బాకీవున్నారు" అన్నాడతను.

"ఆయన మీకు బాకీ ఉన్నట్టు ఏమిటి ఋజువు?"

"ఉన్నాయి!" అంటూ కోటు జేబులోంచి కొన్ని కాగితాలు తీసి, "చూడండి. ఆయన నాతో కుదుర్చు కున్న కాంట్రాక్టు ఫారం! బిల్లులు!" అన్నాడతను.

"ఈ బిల్డింగ్‌లో మరమ్మత్తులేవీ జరిగినట్టు కని పించవే?" అడిగాడు సంజయ్ ఆశ్చర్యంగా.

"అవి మైనర్ మరమ్మత్తులు కావు. మేడమీద అద నంగా కొన్ని గాడర్లు వేయించారు! కుచేలరావుకెందుకో రెండవ అంతస్తు బరువును కప్పూ, గోడలూ భరించలే వేమోనని భయం కలిగింది. అందుకే ఆ యేర్పాట్లు చేయిం చారు. నా కాంట్రాక్టు మొత్తం పన్నెండువేలది. అందులో

ఏడు వేలిచ్చి మిగతా ఐదు వేలు తరవాతిస్తానన్నారు.''

''ఆయన మీ డబ్బు పూర్తిగా చెల్లించలేదని ఏమిటి ఆధారాలు?''

''ఒకవేళ డబ్బు పూర్తిగా చెల్లించిఉంటే, నేనిచ్చిన రసీదులు ఆయనదగ్గరుండాలిగా?''

''ఔను. రసీదులన్నీ నాదగ్గరే ఉన్నాయి. చూస్తారుండండి,'' అంటూ బ్రీఫ్ కేస్ తెరిచాడు లాయర్ శాంతిప్రకాశ్.

కాసేపు అందులోని కాగితాలు పరిశీలించాక, శివసుందరం రాసిచ్చిన ఏడు వేల రసీదు దొరికిందతనికి. దాంతో ఉచేలరావు శివసుందరానికి ఐదు వేలు బాకీ ఉన్నట్టు ధృవపడింది.

శాంతిప్రకాశ్ మొహంలో విచారరేఖలు అలుము కున్నాయి. ''ముందే ఇరవై వేల అప్పులతో తంటాలు పడుతోంటే, మధ్యలో ఇదో లంపలాటం దాపురించింది నా ప్రాణానికి. ఈ సామాను అంత విలువజెయ్యదు అమ్మి తీర్చడానికి.''

''ఐతే. ఏకంగా ఇల్లే వేలం వెయ్యడం మంచిది.'' సలహా ఇచ్చాడు సంజయ్.

''అదెలా? ఇల్లు వెంకపదం పేర ఉంది కదా?''

''ఇంత పెద్ద ఇల్లు వాడేం చేసుకుంటాడు? ఇల్లమ్మేక, అప్పులుపోను మిగిలిన డబ్బు వాడి చేతిలో పెడితే సరి!''

మధ్యలో నిలిపిన వేలం ప్రారంభమైంది మళ్ళీ. అర గంటలోనే నాలుగు వస్తువులు వేలమయ్యాయి. ఆ

నాలుగు వస్తువులు కూడా ఆ పొట్టివ్యక్తే విడిపించు కున్నాడు.

సంజయ్ బుర్రలో ఒకే ఒక్క విషయం కదులుతోంది తీలగా. కుచేలరావు కంట్రాక్టర్ ద్వారా రెండో అంతస్తులో అదనంగా గాడర్లు వేయించాడు. గోడల్లో లెంటర్స్ వేయించాడు. ఎందుకు? రెండో అంతస్తు బరువును కప్పూ, గోడలూ భరించలేవని ఆయనకెందు కను మానం కలిగింది?

తటిల్లతలాంటి మెరుపేదో అతని బుర్రలో మెరుస్తూ, మెరుస్తూ ఆరిపోతోంది. అంతలో మరో రెండు వస్తువులు వేలమయ్యాయి. ఆ రెండు వస్తువులు కూడా ఆ పొట్టి వ్యక్తే విడిపించుకోడంతో మెరిసింది మెరుపు సంజయ్ బుర్రలో తళుక్కున!

"ఆగండి! వేలం ఆపెయ్యండి!" అరిచాడు.

"ఎందుకు? మళ్ళీ ఏమైంది?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఈ వేలంలో బైటివాళ్ళేగాక, కుచేలరావు వారసులు కూడా పాల్గొనవచ్చా?"

"తప్పకుండా. ఎందుకు పాల్గొనకూడదు?" అన్నాడు శాంతిప్రకాశ్.

"ఐతే, నేను వాళ్ళతో కాసేపు సంప్రదించ దలచాను. ఇప్పుడు మధ్యాహ్నం పన్నెండున్నర అవుతోంది. ఇంతటిలో లంచ్ బ్రేక్ జేసి, భోజనాలయ్యాక మళ్ళీ ప్రారంభిద్దాం వేలాన్ని!"

శాంతిప్రకాశ్ తలూపి, "ఆల్ రైట్! మీ ఇష్టం!" అంటూ వేలాన్ని కట్టెయ్యమని పురమాయించాడు.

ఇంటివాళ్ళంతా భోంచెయ్యడానికి డైనింగ్ హాల్లోకి

నడిచారు. భోజనాలదగ్గర సంజయ్ అతిథులతో సంప్రదించి, ఓ నిర్ణయానికి వచ్చాడు. భోజనానంతరం మూడు గంటలకు మళ్ళీ ప్రారంభమైంది వేలం!

సంజయ్ కంఠం సర్దుకుని, "ఫ్రెండ్స్! కుచేలరావు వారసులంతా నన్ను తమ ప్రతినిధిగా ఎన్నుకుని వేలంలో పాల్గొనడానికి నియమించారు. వాళ్ళ తరఫున నేను పాటలో పాల్గొంటున్నాను. ఇక్కడ నాదో చిన్న లిటిగేషన్!

కుచేలరావుమీద మొత్తం పాతిక వేలఅప్పులున్నాయి. అవి తీర్చడానికే ప్రస్తుతం ఈ వేలం జరుగుతోంది గనక, విడిగా ఒక్కొక్క వస్తువూ వేలంవేస్తూ కాలం వృథా చేసుకునే బదులు, అన్నీ కలిపి ఒకేసారి వేలం వెయ్యడం మంచిదనుకుంటాను. నేనీ సామాను మొత్తం ఖరీదు పాతిక వేలతో ప్రారంభిస్తున్నాను."

"నో నో! అలా చెయ్యడం ఆక్షన్ రూల్సుకు విరుద్ధం!" పాయింటాఫ్ ఆర్డర్ లేవదీశాడో పాటి వ్యక్తి.

"మీ పేరు తెలుసుకోవచ్చా బాబూ?" అడిగాడు సంజయ్ వెటకారంగా.

"వేలాయుధం!"

"వేలాయుధంగారూ! వేలం పాతిక వేలతో ప్రారంభమైంది. పెంచదలచుకుంటే పెంచండి. అంతేగానీ, రూల్స్, లిటిగేషన్లతో మా ప్రాణం తోడకండి" అన్నాడు సంజయ్ మొహం చిట్లిస్తూ.

"ఓ. కే! ఇరవైఆరు వేలు!"

"ఇరవైఏడు."

"ఇరవై ఎనిమిది!"

"ముప్పై."

"ముప్పైఐదు!"

"నలభై."

"యాభై!"

"లక్ష!!"

వేలాయుధం నోటికి బ్రేకుపడింది. మొదటిసారి అతని మొహంలో ఆందోళన కనిపించింది. జేబులోంచి కర్చీఫ్ తీసి, నుదుటికి పట్టిన చమట తుడుచుకుని, ఓసారి అటూ ఇటూ చూశాడు. అంతే!

మరుక్షణం అతని కళ్ళు తళతళ మెరిశాయి. ఆందోళన మాయమైంది. చిరునవ్వు నవ్వుతూ చెయ్యెత్తి– "లక్షా ఐదు వేలు!" అన్నాడు గట్టిగా.

చుట్టూ నిల్చున్న వాళ్ళంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారా తతంగాన్ని.

"లక్షాపది వేలు!"

"ఇరవై!"

"ముప్పై!"

"నలభై!"

"లక్షన్నర!!"

వేలాయుధం మొహం మళ్ళీ మారిపోయింది. కర్చీఫ్‌తో నుదురద్దుకుని అటూ ఇటూ చూశాడు. తిరిగి అతని కళ్ళు తళుక్కుమన్నాయి. "లక్షా అరవై వేలు!" అన్నాడు గట్టిగా.

"ఇన్‌స్పెక్టర్! వీణ్ణి అరెస్టు చెయ్యండి!" అన్నాడు సంజయ్ అంతకన్నా గట్టిగా.

"ఎందుకు? ఏమిటీ దౌర్జన్యం?" అన్నాడు వేలాయుధం బిత్తరపోతూ. ఇన్ స్పెక్టర్ ముందుకువచ్చి, "అతను చేసిన నేరం ఏమిటి?" అడిగాడు ఆశ్చర్యంగా.

"కుచేలరావును చంపిన హంతకుణ్ని పట్టుకోవాలనుకుంటే నేను చెప్పినట్టు చెయ్యండి. వాణ్ని కస్టడీలోకి తీసుకుని రండి ఇంట్లోకి!" అంటూ వెనుదిరిగాడు సంజయ్.

ఇన్ స్పెక్టర్ వెంట ఉన్న నలుగురు కాన్ స్టేబుళ్ళూ వేలాయుధాన్ని చుట్టుముట్టారు. సంజయ్ వెనక అతన్ని ఇంట్లోకి తీసికెళ్ళారు. వేలాయుధం ఇంకా అరుస్తున్నాడు. వాళ్ళ వెనకే అతిథులంతా బిలబిల వచ్చారు లోనికి.

సంజయ్ వాళ్ళందర్నీ ఓ గదిలోకి తీసికెళ్ళి, వేలాయుధాన్ని ఓ కుర్చీలో కూర్చోబెట్టి. "చెప్పు! నువ్వు నీ కోసం వేలం పాడుతున్నావా? లేక, నాలా మరొకరి తరఫున పాల్గొంటున్నావా?" అడిగాడు గంభీరంగా.

"మీకా అనుమానం ఎందుకొచ్చింది?"

"ఎప్పుడైతే నా పాట లక్షకు పెంచానో, అప్పుడే నీలో ఆందోళన కనిపించింది. ఖంగారుగా అటూ ఇటూ చూశావ్! మరుక్షణం నీ ఖంగారు పటాపంచలై, పాట పెంచేశావ్. రెండుసార్లు గమనించానలా!

నీవు మరొకరికోసం పాట పాడుతున్నావు గనకే, నేను లక్షకు పెంచేసరికి సందిగ్ధంలో పడిపోయావ్ ఇంకా పెంచాలా, వద్దా అని.అందుకే గుంపులో నిల్చున్న నీ బాస్ వైపు చూశావ్. అతను పాటపెంచమన్నట్టు సైగ చేసి ఉంటాడు. అందుకే నిర్భయంగా పెంచుతూ వచ్చావ్!

లేకుంటే, ఇంట్లోని సామాను ఒక్కసారి కూడా చూడని నువ్వు, వాటి ఖరీదు ఎంతుంటుందో కూడా తెలియని నువ్వు ఏకంగా లక్షా అరవై వేలకి పాట పెంచుతావా? అవి ఎంత విలువ జేస్తాయో నీకు తెలీకపోయినా, నిన్ను నియమించిన వ్యక్తికి మాత్రం బాగా తెలుసు" అంటూ అతిథులవైపూ, ఇన్‌స్పెక్టర్ వైపూ చూసి,

"ఆ అరవై లక్షల సంపత్తిని కుచేలరావు ఎక్కడ దాచాడో నేను ఊహించగలిగాను" అన్నాడు సంజయ్ నవ్వుతూ.

"ఎక్కడ దాచాడు?" అడిగింది సత్యవతి ఆత్రంగా.

"ఎప్పుడైతే కంట్రాక్టర్ శివసుందరం వచ్చి, కుచేలరావు తనద్వారా, భవనంపై అంతస్తులో కొత్తగాడర్లూ, లెంటర్లూ వేయించాడని చెప్పాడో, అప్పుడే దాని గురించి తీవ్రంగా ఆలోచించాను.

ఎన్నో ఏళ్ళనించి రెండవ అంతస్తు బరువు భరిస్తున్న కప్పూ, గోడలూ ఇప్పుడు భరించలేవేమోనన్న భయం కొత్తగా కుచేలరావులో ఎందుకు మొలకెత్తింది? అంటే, ఈ మధ్య అదనంగా రెండో అంతస్తుమీద కొంత బరువు చేరిందన్నమాట! ఏమిటా బరువు?

ఏ రోజైతే నేనూ, షీలా ఇక్కడికి వచ్చామో, మా కోసం ఏర్పాటుచేసిన గదుల్లోని మంచాలూ, గోడల చిత్రపటాలూ నా దృష్టి నాకర్షించాయి. మంచాలన్నీ కదపడానికి వీల్లేకుండా నేలలో పాతేసివున్నాయి. అలాగే చిత్రపటాలు కూడా గోడల్లో బిగించివున్నాయి.

ఇప్పుడు కూడా మీకర్థం కాలేదా? కుచేలరావు తన సంపదను ఏ విధంగా నిక్షిప్తం చేశాడో? ఒకప్పుడు వాళ్ళది ఇత్తడివ్యాపారం గనక, ఇంట్లోని ప్రతివస్తువూ ఇత్తడిలో

తయారుచేయించారు. కుచేలరావు తన సంపదనంతా బంగారంగా మార్చి, ఆ బంగారంతో మంచంకోళ్ళూ, పటాలఫ్రేములూ, ఇతరవస్తువులూ చేయించి అన్నీ పైఅంతస్తులోని గదుల్లో అమర్చాడు.

బంగారానికీ, ఇత్తడికీ రంగులో అట్టే తేడా వుండదు గనక, మిగతా ఇత్తడిసామానులో అవీ కలిసిపోయి ఎవ్వరికీ రవ్వంత అనుమానం కూడా కలగనివ్వకుండా దాగిపోయాయి. కుచేలరావు కోరుకున్నది కూడా అదే! ఏ వస్తువైనా గుప్పిట్లో దాగుంటేనే దానిమీద అందరికీ కుతూహలం కలుగుతుంది. కళ్ళెదురుగా ఎంతటి విలువైన వస్తువున్నా దానిగురించి ఎవ్వరూ పట్టించుకోరు.

అరవైలక్షల బంగారం పాతకాలపు లెక్కల్లో కొన్ని టన్నులుచేస్తుంది. అంత బంగారం వస్తువుల రూపంలో పైఅంతస్తులో అమర్చబడింది గనకే, కుచేలరావుకు దాని కప్పూ, గోడలూ అంతబరువు మోయలేవేమో అన్న అనుమానం కలిగింది!

ఆ రహస్యాన్ని పసిగట్టిన హంతకుడు, వీలునామా తయారు కాగానే ఇంట్లోని వస్తువులన్నీ త్వరాగా వేలం వెయ్యబడాలన్న సాకు కోసం కుచేలరావుని చంపేశాడు. తన మరణానంతరం ఇంట్లోని సామానమ్మి తన అప్పులు తీర్చమని ఆయనే స్వయంగా చెప్పాడు గనక, ఆయన మరణించేవరకూ సామాను వేలంవేసే ప్రసక్తి వుండదు. గనక,కుచేలరావును చంపడం తప్పనిసరిగా భావించాడు.

వేలంలో తన ప్రతినిధిగా వేలాయుధాన్ని ఏర్పాటు చేసుకుని, అతని ద్వారా సామానంతా స్వంతం చేసుకుని, అరవైలక్షలకు తానే అధిపతి కావాలని పన్నాగం పన్నాడు!"

"మైగాడ్! నాకేమీ తెలియదు. వెయ్యిరూపాయల భత్యంమీద సేనతని తరఫున వేలంలో పాల్గొన్నాను. అంతే!" అన్నాడు వేలాయుధం వణికిపోతూ.

"ఇప్పుడు చెప్పు! ఎవరు నియమించారు నిన్ను?"

వేలాయుధం బెదురు చూపులతో అక్కడ నిల్చున్న వాళ్ళందర్నీ కలయజూశాడు.

"అందరిముందూ చెప్పడానికి భయపడుతున్నావా? ఆల్ రైట్. మీరంతా దయచేసి కాసేపు బైటికి నడవండి" అన్నాడు సంజయ్.

అతిధులందరూ అడుగులో అడుగు వేసుకుంటూ అవతలికెళ్ళారు. సంజయ్ ఇన్‌స్పెక్టర్ని దగ్గరికి పిల్చి, అతని చెవిలో ఏదో ఊదాడు. మరుక్షణం నలుగురు కానిస్టేబుళ్ళతో బైటికి నడిచాడు ఇన్‌స్పెక్టర్.

సంజయ్ నింపాదిగా జేబులోంచి సిగరెట్ కేస్ తీసి, ఓ సిగరెట్ వేలాయుధానికిచ్చి, తనొకటి వెలిగించుకున్నాడు. తరవాత, నెమ్మదిగా లేచి, గది కిటికీవైపు నడిచాడు. అప్పటికే బయట చీకట్లు ముసురుకున్నాయి. కిటికీ రెక్కలు తెరిచిపెట్టి, గదిలో లైటు వెలిగించి, తిరిగి వేలాయుధం ముందు చతికిలబడ్డాడు.

"ఇప్పుడు చెప్పు! వేలంపాటకు నిన్నెవరు నియమించారు?"

వేలాయుధం చెప్పడానికి నోరు తెరిచాడు. అంతే!

"ఢాం!"మన్న శబ్దంతో దిక్కులు పిక్కటిల్లాయి.

మరుక్షణం కిటికీ అవతల చీకట్లో చిన్న కేక వినిపించింది.

"వెరీగుడ్ ఇన్‌స్పెక్టర్! ఇక హంతకుణ్ని లోపలికి తీసుకురండి" అన్నాడు సంజయ్ సంతృప్తిగా.

ఆ శబ్దానికి హాల్లోవున్న వాళ్ళంతా (దిలోకి పరిగెత్తు కొచ్చారు.

రెండునిమిషాల తరవాత బూట్సులు టకటక చప్పుడు చేసుకుంటూ, కుడిచేతి గాయంనించి రక్తం కారుతున్న ఓ వ్యక్తిని లోపలికి తీసుకొచ్చారు పోలీసులు.

ఆవ్యక్తిని చూడగానే సంజయ్‌తోబాటు అక్కడున్న వాళ్ళంతా దిగ్భ్రాంతితో శిలాప్రతిమలైపోయారు. అతను ఎవ్వరోకాదు.

శాంతిప్రకాశ్! లాయర్ శాంతిప్రకాష్!!

"వండర్‌ఫుల్ మిస్టర్ శాంతిప్రకాశ్! వేలంపాట కోసం తనను నియమించిన వ్యక్తిపేరు చెప్పడానికి వేలాయుధం ప్రయత్నిస్తే హంతకుడు తప్పకుండా అతన్ని చంపడానికి ప్రయత్నిస్తాడని ఊహించే మీ అందర్నీ బయటికి పంపి, కిటికీరెక్కలు తెరిచిపెట్టాను.

ఐతే, ఆ హంతకుడివి నువ్వే అవుతావని మాత్రం నేనూహించలేదు!

ఇప్పుడర్థమైంది. ఆ రోజు రాత్రి నీ అంతట నువ్వే తల వెనకనించి వీపులో కత్తి దింపుకుని, కర్చీఫ్‌తో కుచేలరావుని చంపి, నీమీద ఎవ్వరికీ అనుమానం రాకుండే జాగ్రత్తపడ్డావన్న మాట!" అన్నాడు సంజయ్ సాలోచనగా తలూపుతూ.

లాయర్ తల వాలిపోయింది, యూరియా దొరకని పైరులా!

—:ఐపోయింది:—